జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 13 | పక్షపత్రిక | జూలై 16-31, 2013



## రాజకీయ ప్రక్షాళనకు సుప్రీంకోర్టు తీర్పులు



పార్టీల ఉచిత హామీలను నియంత్రించాలి



శిక్షపడితే పదవి ఖాళీ
జైలులో వుంటే పోటీకి అనర్హులు



పిడుగురాళ్ళ పాదయాత్రలో ప్రజలతో జేపీ



గుంటూరు నెమలిపురిలో చిన్నారితో జేపీ



గుంటూరు పిడుగురాళ్ళలో పార్టీ ఆఫీసు ప్రారంభోత్సవంలో
డా॥ జయప్రకాష్ నారాయణ్, కటారి శ్రీనివాసరావు





తెనాలిలో కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్
25వ స్మారకోపన్యాస సభలో డా॥ జయప్రకాష్ నారాయణ్



ఎన్నికల్లో ఓటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జేపీ



కూకట్‌పల్లిలో నూతన డంపింగ్‌యార్డును ప్రారంభిస్తున్న డా॥ జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూలై 16-31, 2013

సంపుటి - 4 సంచిక - 13

## లోపలి పేజీల్లో...

ఇది ఉచితమేనా......................................5

పార్టీల అనుచిత ఉచితాలకు అడ్డుకట్ట సాధ్యమే...... 11

పార్టీల ఉచిత హామీలపై సుప్రీం ఆదేశాన్ని స్వాగతించిన లోక్‌సత్తా................ 14

దోషిగా తేలితే అనర్హులే..............................15

నేరనేతలపై సుప్రీం తీర్పుకు ఆహ్వానం : జేపీ....... 17

ముందే ఉదంతాన్ని ఈసీ ఉపయోగించుకోవాలి.... 18

హైకోర్టు ఆదేశాల మేరకు సహకార చట్టం తేవాలి... 19

ఆహార భద్రతపై ఆర్డినెన్స్ గర్హనీయం : జేపీ.........20

అవినీతిలో మనం గ్రేట్.............................. 21

సామాజిక అభివృద్ధి ఎక్కడ.......................... 22

అక్షరాలా మనది అధమస్థానం..................... 23

ఖ 'నిజం'... జాతి సొత్తు కాదు..................... 25

లోక్‌సత్తా వార్తలు ................................. 27

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# మోడీ కల సాకారమౌతుందా!

## సంపాదకీయం

మోడీ చూపు ఢిల్లీ మీదకి మళ్లింది. బిజెపి అంతర్గత కుమ్ములాటల్ని ఆయన చాకచక్యంగా వినియోగించుకున్నారు. అద్వానీ అడ్డు తొలగించుకున్నారు. ఆర్.ఎస్.ఎస్ మద్దతు సంపాదించుకున్నారు. ఈ క్రమం అంతా ఆయనకు అనుకూలంగానే సాగింది. బిజెపి ప్రచార సారథిగా నియమితులయ్యారు. లాంఛనంగా ప్రధాని అభ్యర్థిగా ప్రకటన రాకపోయినా ఇప్పుడు బిజెపికి ఆయనే ప్రధాని అభ్యర్థి. అంటే మోడీ ఇప్పటికి ఇంటగెలిచారు. ఇక రచ్చ గెలుస్తారా అన్నదే ప్రశ్న.

ఇక దేశంలో రాజకీయపర్వం చాలా మారింది. యూపిఎ-2 గత నాలుగేళ్లుగా అచేతన ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంది. అవినీతి కుంభకోణాల వలయంలో చిక్కుకుంది. మధ్యతరగతిలో, యువతలో తన స్థానాన్ని చాలావరకు కోల్పోయింది. వచ్చే ఎన్నికల్లో అది పీకలలోతు కష్టాలలో ఎదురీతలో పడింది. బిజెపి ఈ పరిస్థితిని ఇంతవరకు ఉపయోగించుకోలేకపోయింది. దాని సమయం అంతర్గత కల్లోలాలతోనే వృథా చేసుకుంది. అధికార పక్షం పాలించలేని స్థితి. ప్రతిపక్షం అందుకోలేని స్థితి కొనసాగింది. ఈ పూర్వరంగంలో ప్రాంతీయ పార్టీల విజృంభణ సహజ పరిణామం. దేశంలో ఐదు పెద్ద రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలో వున్నాయి. అవి దేశ రాజకీయాలలో కీలకపాత్ర పోషించే స్థితి తెచ్చుకున్నాయి.

బిజెపి ప్రచారసారథిగా మోడీ ఎన్నిక ఈ ప్రాంతీయ పార్టీలను కలవరపరిచింది. ఒకపక్క మోడీ విజయోత్సవాలు సాగుతుండగానే మరోపక్క వారి కూటమి నుండి జెడియు బైటకొచ్చింది. ఆయనకు తోడుగా ఒరిస్సాలో బిజూ పట్నాయక్, బెంగాల్ మమతలు నిలిచారు.

ఇప్పుడు మోడీ నాయకత్వంలోని యన్.డి.ఎ లో శివసేన, అకాలీదళ్‌లు మాత్రమే మిగిలాయి. ఇది మోడీకి ఒక పెద్ద సవాలు. మిత్రపక్షాలు, ప్రాంతీయ పార్టీల ప్రమేయం లేకుండా గెలిచే మార్గాలను అన్వేషించుకోవాలి. ఆయన అదే పనిలో వున్నట్టు కనిపిస్తున్నది.

గుజరాత్ అభివృద్ధి నమునాను మోడీ తన ఎన్నికల సాధనం చేసుకుంటారని అందరూ భావించారు. సమర్థవంతమైన పాలన, సత్వర అభివృద్ధి అవినీతి రహిత పాలనతో కాంగ్రెస్‌ను, ఇతర ప్రాంతీయ పార్టీల మీద దాడి చేస్తారని ఆశించారు. అదే జరిగితే కాంగ్రెస్ ఇరుకున పడేది. దాని బలహీనత బయటపడేది. దాని ఎన్నికల ప్రచారం ఆత్మసమర్థనతోనే ముగిసిపోయేది. కాని మోడీ దీనికి భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తున్నది. దేశాన్ని మత ప్రాతిపదికగా కుల ప్రాతిపదికగా చీల్చే సంకేతాలను బలంగా ఇస్తున్నారు. అమిత్‌షాను ఉత్తరప్రదేశ్‌కు పంపించి రామాలయాన్ని నిర్మిస్తామని ప్రకటించడంతో ఈ కథ మొదలైంది. మరోపక్క బి.సి.లకు పార్లమెంటులో రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఇవ్వనున్నట్లు వార్తలొచ్చాయి. అన్నిటికీ మించి మోడీ స్వయంగా తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. దీంతో ఆయన ఎన్నికల వ్యూహం బైటపడింది. దేశ ప్రజల్ని మతప్రాతిపదికపై చీలిస్తే మిత్రపక్షాలు, ప్రాంతీయ పార్టీల దోస్తీ అవసరం లేకుండా గెలుపు సాధించాలన్నదే లక్ష్యంగా కనిపిస్తున్నది. ఈ వ్యూహం మోడీకి కలిగించే లాభం కంటే కాంగ్రెస్‌కు కలిసి వచ్చేదే అవుతుంది. హిందూ జాతీయవాదమే మోడీ నినాదమైతే కాంగ్రెస్‌కు ఎన్నికల ముందు తర్వాత ఇబ్బడిముబ్బడిగా మిత్రుల్ని పొందే అవకాశం వస్తుంది. మోడీకి నిరాశ తప్పకపోవచ్చు. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఇది ఉచితమేనా!

**ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ఇస్తున్న ఉచిత హామీలను నియంత్రించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వేమూరి రాధాకృష్ణ రాసిన వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం......**




ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయపార్టీలు ప్రకటిస్తున్న ఉచిత హామీలపై ఎట్టకేలకు సుప్రీంకోర్టు కన్నెర్ర చేసింది. విధానాలు, సిద్ధాంతాలతో ప్రజలను మెప్పించి ఓట్లు పొందే పద్ధతికి రాజకీయ పార్టీలు ఏనాడో తిలోదకాలు ఇచ్చాయి. మూడు దశాబ్దాల క్రితం వరకు అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో చెప్పేవారు. తర్వాతి కాలంలో క్రమంగా ఏమి ఇస్తామో చెప్పడం మొదలెట్టారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు బడుగు, బలహీన వర్గాల వారికి బర్రె, గొర్రెవంటివి ఉచితంగా ఇవ్వడం ప్రారంభించారు. తర్వాతి కాలంలో రుణమాఫీ పథకాలకు తెర లేచింది. ఇటీవలికాలంలో ఈ విషయంలో అన్ని హద్దులూ చెరిగిపోయాయి. పేదల పేరిట ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి ఉచితంగా ఇవ్వడం మొదలెట్టారు. టీవీలు, గ్రైండర్లు, లాప్‌టాప్‌లు వంటివి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కొన్ని రాష్ట్రాలలో రూపాయికి కిలో బియ్యం ఇస్తూ ఉంటే, మరికొన్ని రాష్ట్రాలలో ఉచితంగా ఇవ్వడానికి రాజకీయ పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఈ హామీలకు అయ్యే ఖర్చంతా ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించాలి. అంటే రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి రావడం కోసం ప్రజల డబ్బును విచ్చలవిడిగా ఖర్చుచేస్తున్నాయన్న మాట! ఇలా ఖర్చు చేసే అధికారం వాటికి ఎవరిచ్చారు? అంటే సమాధానం చెప్పలేరు. రాజకీయ పార్టీలు లేదా వాటి అభ్యర్థులు ఓటర్లకు డబ్బు పంపిణీ చేసి ఎన్నికలలో గెలవడానికి ప్రయత్నం చేయడం ఇటీవలి కాలంలో మనం చూస్తున్నాం. ఇప్పుడు ఓట్ల కొనుగోలుకు అదనంగా ఉచిత హామీలు వచ్చి పడ్డాయి. సంక్షేమం పేరిట విచ్చలవిడిగా ప్రజాధనాన్ని పంపిణీ చేసే విధానానికి రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా మన రాష్ట్రంలో బీజం పడింది. ఈ పథకాల మోజులో పడిన ప్రజలు ప్రజాధనం దోపిడీ జరుగుతున్నా పట్టించుకోలేని స్థితికి చేరుకున్నారు. దీంతో ఇదేదో బాగుందనుకున్న మిగతా రాజకీయ పార్టీలు కూడా వచ్చే ఎన్నికలలో ఉచిత హామీలు ఇవ్వడానికి సిద్ధపడుతున్నాయి. ఉచిత హామీలను అవినీతిగా పేర్కొనలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసి ఉండవచ్చుగానీ, ఈ ప్రక్రియ అవినీతి కంటే ప్రమాదకరమైంది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనే తీసుకోండి. సంక్షేమ పథకాల పేరిట ప్రజలందరినీ మానసికంగా అవినీతిపరులను చేశారు. దీంతో 'మీరు ఎంత తిన్నా పర్వాలేదు-మాకింత పెట్టండి' అని ప్రజలు బాహాటంగానే కోరుతున్నారు. అంటే ఉన్నతస్థాయిలో చోటుచేసుకుంటున్న



అవినీతి గురించి ఆలోచించే తీరిక ప్రజలకు లేకుండా పోతున్నది. ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోడానికి అన్నట్లుగా, అన్ని రాజకీయ పార్టీలు అలాగే ఉన్నప్పుడు తమకు ఎవరు ఎక్కువగా, నమ్మకంగా పెడతారో వారినే ఆదరించాలన్న అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారు. ఉచిత హామీల విషయంలో రాజకీయ పార్టీలు కూడా విషవలయంలో చిక్కుకుంటున్నాయి. సిద్ధాంతాలు, విధానాలు చూసి ఓటు వేయండి, అని కోరితే వినిపించుకునే స్థితిలో ఓటర్లు లేరు. ఇందుకు లోక్‌సత్తా వంటి పార్టీల స్థితి నిదర్శనం. ఆరోగ్యకరమైన సమాజం నిర్మిస్తామని చెప్పేవాళ్లను పిచ్చివాళ్లుగా చూస్తున్నారు. 'రేపటి సంగతి కాదు-ఈరోజు ఏమి చేస్తారో చెప్పండి' అని ప్రజలు అడుగుతున్నారు. ఈ పరిణామంతో రాజకీయ పార్టీలన్నీ అధికారంలోకి రావాలంటే ఏదో ఒక ఉచిత హామీని ఇవ్వక తప్పని స్థితి ఏర్పడింది.

ఉచిత హామీల వల్ల దీర్ఘకాలంలో ఏర్పడే దుష్పరిణామాల గురించి చెప్పినా వినిపించుకునే స్థితిలో ఎవరూ లేరు. అలా ఎవరైనా చెబితే చేతకానివాడుగా చూస్తున్నారు. ఫీజుల చెల్లింపు పథకాన్నే తీసుకుందాం. అర్హతలతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని వర్తింపజేయడం వల్ల ఇప్పుడు ఇంటికొక నిరుద్యోగ ఇంజనీరు తయారయ్యారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ తెల్ల రేషన్‌కార్డులతో ముడిపెట్టడం వల్ల జనాభా కంటే ఎక్కువగా తెల్ల రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. అంటే రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న పథకాల వెనుక ప్రజాహితం కన్నా రాజకీయ ప్రయోజనమే అధికంగా ఉంటోందని స్పష్టమవుతోంది. రాజకీయ పార్టీలలో చిత్తశుద్ధి, నిజాయితీ లోపించడం వల్ల ఈ దుస్థితి ఏర్పడింది. సంక్షేమం పేరిట విచ్చలవిడిగా ఖర్చుచేస్తే భావితరాల పరిస్థితి ఏమిటి? స్వాతంత్ర్యం వచ్చి 66 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారు. కనీస వసతులైన తాగునీరు దొరకదు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులో లేని పరిస్థితి. అయినా వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసి సంక్షేమం పేరిట ఉచిత పథకాలు అమలు చేస్తూ ఉంటారు. ఇక్కడ మరో విషయం ప్రస్తావించవలసి ఉంది. ఎన్నికలకు ముందు ప్రకటిస్తున్న హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేయకపోయినా ఆయా పార్టీలను అడిగేవారు లేరు. దీంతో 'ఏరుదాటాక తెప్ప తగలేయవచ్చు' అన్న అభిప్రాయానికి పార్టీలు వస్తున్నాయి. ఉచిత హామీలను ఎన్నికల నియమావళి పరిధిలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవలసిందిగా సుప్రీంకోర్టు తన ఆదేశాలలో ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఇప్పుడు ఉన్న ఎన్నికల నియమావళి అమలుకే దిక్కులేదు.



మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్‌ల పంపిణీలో
తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత

పార్టీలు ప్రకటించే ఉచిత పథకాలకు చట్టపరమైన జవాబుదారీతనం తీసుకురావాలి. అంటే ఏదైనా రాజకీయ పార్టీ ఎన్నికలకు ముందే ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేకపోతే అధికారం నుంచి తప్పుకోవలసిన పరిస్థితి కల్పించాలి. అప్పుడే పార్టీలు హామీలు ప్రకటించే ముందు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి. అదే సమయంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని ఎన్నికలకు ముందు, ఎన్నికల కమిషన్ చొరవ తీసుకుని రాజకీయ పార్టీలకు వివరించాలి. దీనివల్ల తాము అధికారంలోకి వస్తే ఏమి చేయగలమో, ఏమి చేయలేమో నిర్ణయించుకునే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంటుంది. అదే సమయంలో ఉచిత హామీలను ప్రకటించే రాజకీయ పార్టీలు తాము ప్రకటిస్తున్న హామీల వల్ల సమాజానికి ఎటువంటి మేలు జరుగుతుందో వివరించే విధానం ఉండాలి. వీటన్నింటికీ మించి, సమాజం పట్ల రాజకీయ పార్టీలకు బాధ్యత ఉండాలి. మన రాష్ట్రంలో సంక్షేమం పేరిట అమలుచేస్తున్న కొన్ని పథకాల వల్ల సోమరిపోతులు, తాగుబోతుల సంఖ్య పెరిగిపోతున్నది. మద్యం అమ్మకాల నుంచి వచ్చే ఆదాయం లేకపోతే సంక్షేమ పథకాలు అమలు చేయలేని స్థితి. అంతదాకా ఎందుకు? అధికారంలో ఉన్న తాము ఎంతో అభివృద్ధి సాధించామని చెబుతున్న రాజకీయ పార్టీలు ఇంతకాలం తర్వాత కూడా ఉచిత పథకాల అవసరం ఏమి వచ్చిందో చెప్పగలవా? అంటే తాము చెబుతున్న అభివృద్ధి అయినా బూటకం అయి ఉండాలి. లేదా సంక్షేమ పథకాలైనా బూటకం అయి ఉండాలి. ఏది నిజమో అందరికీ తెలుసు. ఎవరి ప్రయోజనాలు వారికి దక్కుతున్నాయి కనుక ఎవరూ నోరెత్తరు. అదేమని ప్రశ్నించినవాడిని వెర్రివాడిగా చూస్తున్నారు. ఏదైతేనేమి ఉచిత పథకాల విషయంలో ఎట్టకేలకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది కనుక పరిస్థితులలో మార్పు వస్తుందని ఆశిద్దాం. ఈ దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తూ ఉంటే నిద్రపట్టడం లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు గురించి, భావితరాల గురించి ఆలోచించే వారెవ్వరికైనా అలాగే అనిపిస్తుంది. దురదృష్టం ఏమిటంటే దేశ భవిష్యత్తు గురించి ఆలోచించవలసిన రాజకీయ పార్టీలకే ఈ ధ్యాస లేకుండా పోతున్నది. ఎన్నికలలో గెలవడం వరకే వారి ఆలోచనలు పరిమితం అవుతున్నాయి. ఉదాహరణకు మన రాష్ట్ర విభజన విషయం తీసుకుందాం. తెలంగాణ ప్రజలు కోరుతున్నారు కనుక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని



**ప్రభుత్వ సొమ్ముతో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేస్తున్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్**

కాంగ్రెస్ అధిష్ఠానం భావించడం లేదు. రాష్ట్రాన్ని విభజిస్తే ఎక్కువ సీట్లు వస్తాయా? సమైక్యంగా ఉంచితే ఎక్కువ సీట్లు వస్తాయా? అన్నదానిపైనే దృష్టి అంతా! అంటే ఒక పర్యాయం ఎన్నికలలో గెలవడం కోసం రాష్ట్రాలను సైతం విభజించగలరు లేదా సమైక్యంగా ఉంచగలరన్న మాట! కాంగ్రెస్ పార్టీనే కాదు- అన్ని రాజకీయ పార్టీల ఆలోచనలు ఇలాగే సాగుతున్నాయి. ఇంతటి ప్రమాదకరంగా, సంకుచితంగా ఆలోచిస్తున్న రాజకీయ పార్టీల చేతిలో మన భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఊహించుకుంటే జయప్రకాష్ నారాయణ్‌కే కాదు మనకు కూడా నిద్ర పట్టదు. అయినా సర్దుకుపోతున్నాం. ఎందుకంటే మన ఆలోచనలు కూడా వ్యక్తిగత స్వార్థానికి పరిమితం అయ్యేలా చేశాయి ఈ రాజకీయ పార్టీలు.

హిపోక్రసీ మనల్ని కమ్మేసింది. నిజం మాట్లాడిన వాడు బోను ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆత్మవంచన-పరనిందకు అలవాటు పడిన మనం. తెలుపును తెలుపుగా, నలుపును నలుపుగా చూడలేని స్థితిలో ఉన్నాం. ఇందుకు బి.జె.పి. ఎంపీ గోపీనాథ్ ముండే వ్యవహారమే నిదర్శనం. 1980లో అసెంబ్లీకి పోటీ చేసిన తనకు రూ. 29 వేలు మాత్రమే ఖర్చు అయితే 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఎంపీగా గెలవడానికి రూ. 8 కోట్లు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని ముండే ప్రకటించారు. ఇది నిజాయితీగా ముండే చేసిన ప్రకటన. అయితే ఈ నిజాయతీనే ఇప్పుడు ఆయనకు కష్టాలు తీసుకువచ్చింది. పరిమితికి మించి ఎన్నికలలో వ్యయం చేయడంతోపాటు, ఆ విషయాన్ని దాచిపెట్టినందుకు సంజాయిషీ కోరుతూ ముండేకు ఎన్నికల కమిషన్ నోటీసు జారీ చేసింది. ఇక్కడ ఎన్నికల కమిషన్ చర్యను కూడా తప్పుపట్టలేం. లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థుల గరిష్ట వ్యయపరిమితి పెద్ద రాష్ట్రాల్లో రూ. 40 లక్షలుగా, చిన్న రాష్ట్రాల్లో రూ. 16 లక్షలుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ పరిమితికి మించి ఖర్చు చేయడం నేరమే అవుతుంది. చట్టాలను గౌరవించేవారికి గోపీనాథ్ ముండే వ్యవహారం తప్పుగానే కనిపిస్తుంది. అయితే వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో చూద్దాం. ఇవ్వాళ కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా ఎన్నికలలో ఎవరైనా గెలిచే పరిస్థితి ఉందా? మన రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలలో శాసనసభ్యుడిగా ఎన్నికైన ఒక వ్యక్తి 25 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారు. అయితే ఆ విషయం ఆయన బయటకు చెప్పలేదు. కనుక ఆయనకు ఎవరూ నోటీసులు జారీ చేయలేరు. అంతమాత్రాన ఆయన చేసిన ఖర్చు.... ఖర్చు కాకుండా పోతుందా? మన రాష్ట్రం నుంచి గెలిచిన ఎంపీలు తక్కువలో తక్కువ రూ. 10 కోట్లు ఖర్చు చేస్తే, గరిష్టంగా 50 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసినవారు ఉన్నారు. ఈ విషయం ఎన్నికల కమిషన్ అధికారులకూ తెలుసు. మీడియాకూ తెలుసు. న్యాయవ్యవస్థకు కూడా తెలుసు. అయినా హిపోక్రసీలో బతుకుతున్నాం కనుక అది తప్పుగా మనకు కనబడటం లేదు. గోపీనాథ్ ముండే ఉదంతం తర్వాత కొన్ని మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అమలు చేయలేని చట్టాలను కొనసాగిస్తూ, సదరు చట్టాలు అమలవుతున్నాయని భావిస్తూ ఆత్మవంచనతో బతకడమేనా? లేక చట్టాలను కాలానుగుణంగా మార్చుకుంటూ పోవడమా? ఎన్నికల వ్యయపరిమితిలో మార్పు చేయకుండా, ఎన్నికలలో అపరిమితంగా పెరిగిపోయిన వ్యయాన్ని అదుపు చేయలేకపోతూ, నిబంధనలను అమలు చేయాలనుకోవడం ఏమిటి?నానాటికీ ఎన్నికల వ్యయం పెరిగిపోతూ ఉండటంతో ఎన్నికలలో పోటీ చేయాలంటేనే అభ్యర్థులు భయపడే పరిస్థితి వచ్చింది. డబ్బులు ఇవ్వనిదే ఓటు వేయడానికి మెజారిటీ ఓటర్లు సిద్ధంగా లేరు. పోనీ ఒకరివద్ద డబ్బు తీసుకుని వారికే ఓటు వేస్తున్నారా? అంటే అదీ లేదు. అందరి దగ్గరా డబ్బు తీసుకుని తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నారో వారికే వేస్తున్నారు. ఇక్కడ ఓటర్లలో కూడా నిజాయతీ లోపించింది. తాము ఎంత డబ్బు ఇచ్చినా ఓటర్లు తమకే ఓటు వేస్తారన్న గ్యారంటీ లేని విషయం రాజకీయ పార్టీల అభ్యర్థులకు కూడా తెలుసు. అయినా డబ్బు పంచకపోతే ఆ మాత్రం ఓట్లు కూడా రావన్నది వారి భయం. డబ్బు తీసుకుని ఓటు వేయడం నేరం. అలాగని ఓటర్లపై చర్య తీసుకోగలమా? డబ్బు పంచడం నేరం. మరి రాజకీయ పార్టీలపై చర్య తీసుకోగలుగుతున్నామా? ఇదీ లేదు. ఎవరైనా నిజాయతీగా జరిగిన విషయం చెబితే వాడిని బకరా చేయడానికి మాత్రం ఎక్కడలేని ఉత్సాహం చూపిస్తారు. గోపీనాథ్ ముండేపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన దిగ్విజయ్‌సింగ్ లాంటి నాయకులు కోరడం హాస్యాస్పదం కాదా? ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికలలో ఎంత ఖర్చు చేసిందీ ఆయనకు తెలియదా? అయినా దిగ్విజయ్‌సింగ్ విమర్శలు చేయడం

ఆత్మవంచన-పరనింద కాదా? చట్టాలను అమలు చేయలేనప్పుడు ఆ చట్టాలను రద్దు చేయడమే మేలు! చట్టాలు అమలుకు నోచుకోకపోవడం, చట్టం ఒక్కొక్కరి విషయంలోఒక్కో విధంగా అమలుకావడం వల్ల మొత్తం చట్టాలపైనే ప్రజలలో విశ్వాసం పోతోంది. దీన్ని అక్రమార్కులు ఆసరాగా తీసుకుంటున్నారు. అంతిమంగా ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతోంది. కోటీశ్వరులు మాత్రమే ఎన్నికలలో పోటీచేయగల పరిస్థితి దాపురించడంతో ప్రజలకు నిజంగా సేవ చేయాలన్న భావన ఉన్నవారు ఎన్నికల బరిలోకి దిగలేకపోతున్నారు. ఎక్కడైనా, ఎవరైనా ముందుకు వచ్చినా వారికి ప్రజల ఆదరణ లభించడం లేదు. అభ్యర్థుల నుంచి డబ్బు తీసుకుంటే ప్రజా సంపదను లూటీ చేయడానికి సదరు అభ్యర్థులకు లైసెన్సు ఇస్తున్నామన్న స్పృహ ఓటర్లలో ఉండటం లేదు. అందరూ ఆ తానులో ముక్కలే కదా! అన్న భావనతో ప్రజలు ఉన్నారు. ఎన్నికలలో పోటీచేసే వారంతా ఒకే కేటగిరీకి చెందినవారు అయినప్పుడు మాకు మాత్రం ఏమి ప్రత్యామ్నాయం ఉంది? అని కొందరు అడుగుతుంటారు. ఇటువంటి వారి ప్రశ్నలో కూడా హేతుబద్ధత ఉంది. అయితే పోటీలో ఉన్నవారిలో తక్కువ ప్రమాదకారిని ఎంచుకోవడమే ప్రస్తుతానికి మన ముందున్న ప్రత్యామ్నాయం. రాజకీయ పార్టీలలో మార్పు వస్తుందని ఆశించడం అవివేకం. తెలంగాణ రాష్ట్ర సమితి వంటి ఉద్యమ పార్టీలు కూడా డబ్బున్న వారికే టికెట్లు ఇవ్వాలన్న ఆలోచనకు రావలసిన పరిస్థితులు ఉన్నప్పుడు, పార్టీలలో మార్పు వస్తుందని ఎలా ఆశిస్తాం? ఎన్నికల సందర్భంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం అనివార్యమైన ప్రక్రియగా మారిపోయింది. దీన్ని నివారించలేని స్థితిలో ఎన్నికల కమిషన్ ఉంది.

## వేలం.. ఓ మీ మాంస!

ఈ పరిస్థితి పోవాలంటే ప్రజలలో మార్పు రావడం ఒక్కటే పరిష్కారం. ఎందుకంటే చట్టాలను చుట్టాలుగా చేసుకుంటున్నారు. వ్యవస్థలన్నింటినీ డొల్లలుగా మార్చారు. అడుగడుగునా ఆత్మవంచనతో బతుకుతున్నారు. అలా బతకాల్సిన పరిస్థితులు కల్పించారు. ఇక్కడ మరో ఆసక్తికర అంశం గురించి చర్చించుకోవలసిన అవసరం ఉంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. దీంతో కొన్ని గ్రామాల ప్రజలు తమ గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఎవరు ఎక్కువ ఖర్చు చేయడానికి ముందుకు వస్తే వారినే సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఈ ప్రక్రియను సర్పంచ్ పదవులకు వేలంగా మీడియా ప్రచారం చేస్తోంది. ఇలా చేయడం ఒక రకంగా వేలం కిందకే వస్తుంది. మీడియా ప్రచారంతో ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగి గ్రామాభివృద్ధికి డబ్బు ఖర్చు చేయడానికి ముందుకు వచ్చి సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎన్నికల కమిషన్ దృష్టిలో అది సరైన చర్యే! అయితే ఇక్కడ కూడా ఆత్మవంచనే చోటుచేసుకుంటోంది. ఎందుకంటే ఈ వేలం పాటలను క్రిమినల్ కేసులు పెట్టడం ద్వారా అరికట్టవచ్చు. అయితే ఎన్నికలలో ఓటర్లకు డబ్బు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేయడాన్ని నిలువరించగలరా? నిన్నగాక మొన్న జరిగిన సహకార ఎన్నికలలో ఒక్కో ఓటుకు 20 వేల రూపాయల వరకు పంచినట్టు కథనాలు వచ్చాయి. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా కూడా గత ఎన్నికలలోనే పాతిక, ముప్పై లక్షల రూపాయలు ఖర్చు చేసిన వారిని ఎందరినో చూశాం. కొన్నిచోట్ల ఈ వ్యయం కోటి కూడా దాటింది. అంటే ఓటర్లకు డబ్బు ఇవ్వడం నేరం కాదా? అలా డబ్బు పంచడాన్ని ఆపలేని మనం, గ్రామభివృద్ధికి ఖర్చు చేయడానికి ముందుకు వచ్చేవారు మాత్రమే నేరం చేసినట్టుగా పరిగణించి ప్రచారం చేయడం ఆత్మవంచన కాదా? వ్యక్తులకు డబ్బు పంపిణీ చేసి ఓట్లు కొనుక్కునే కన్నా గ్రామాభివృద్ధికి సొంత డబ్బు ఖర్చు చేయడం నేరం ఎలా అవుతుంది? ఈ ప్రక్రియ వల్ల కనీసం గ్రామాలైనా బాగుపడతాయి కదా! అయితే ఇందుకు చట్టం అనుమతించదు. అలాంటప్పుడు ఏమి చేయాలి? గ్రామాభివృద్ధి కోసం సొంత నిధులు ఖర్చు చేయడానికి ముందుకు వచ్చేవారు సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నికకావడానికి వీలుగా చట్టాన్ని సవరించాలి. ఇలా చేయడానికి హిపోక్రసీ అడ్డువస్తుంది. సర్పంచ్ పదవి కొనుక్కోవడం నైతికంగా తప్పు అవుతుంది. దీనివల్ల డబ్బులేని వారికి సేవచేసే అవకాశం లభించని విషయం కూడా వాస్తవమే! నిజంగా సేవ చేసేవారినే సర్పంచ్‌గా ఎన్నిక చేసుకోవాలని గ్రామ ప్రజలు భావిస్తే ఇలాంటి వాటికి అవకాశం ఉండదు. అయితే ఎవరినీ నమ్మలేని స్థితికి సమాజం చేరుకుంది. అందుకే వేలం పాటల విధానానికి అంకురార్పణ జరిగింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే మరమ్మతులు ఎక్కడ మొదలుపెట్టాలో తెలియని పరిస్థితి. దాదాపుగా అన్ని

వ్యవస్థలపై నమ్మకం పోవడంతో ప్రజలు తమకు తోచిన మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీర్ఘకాలిక దుష్ప్రయోజనాల గురించి ఆలోచించకుండా తాత్కాలిక ప్రయోజనాల పట్ల మొగ్గు చూపుతున్నారు. ఏది మంచి? ఏది చెడు? అనే సంఘర్షణ ఇప్పుడు జరుగుతోంది. ఒకరికి మంచిగా కనబడుతున్నది మరొకరికి చెడుగా కనిపిస్తున్నది. దీంతో అందరూ అందరే అన్న వ్యాఖ్యలు తరచుగా వినిపిస్తున్నాయి.

**దామాషా పద్ధతే మందు !**

మళ్లీ ఉచిత హామీల విషయానికి వద్దాం. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత హామీలను అవినీతి చర్యలుగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసి ఉండవచ్చుగానీ, ఈ ఉచిత హామీలు అంతకంటే ప్రమాదకరమైనవి. అడ్డగోలుగా ఉచిత హామీలు ఇవ్వడం ద్వారా మొత్తం సమాజాన్ని అవినీతి ఆలోచనలతో నింపేస్తున్నారు. ఉచిత హామీలు అనేవి ఒక రకంగా క్విడ్ ప్రో కో కిందకు వస్తాయి. సమాజంలో అధిక సంఖ్యలో ఉన్న పేదలను ఈ ఉచిత హామీలతో లోబరచుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలు ఎలాగూ సంపన్నవర్గాలకు అనుకూలంగానే ఉంటాయి. ఎందుకంటే ఇప్పుడు చట్టసభల్లోకి వెళుతున్న వారిలో అత్యధికులు సంపన్నులే కనుక. ఎటొచ్చీ మధ్య తరగతి వారే ఎవరికీ పట్టడం లేదు. దీంతో మధ్య తరగతి ప్రజలకు రాజకీయ వ్యవస్థపై నమ్మకం పోతోంది. దీని ప్రభావం ఓటింగ్‌పై పడుతోంది. సంపన్నులతోపాటు మధ్య తరగతి వారు కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండటం వల్ల అల్పాదాయ వర్గాల ప్రజలు వేసే ఓట్ల ఆధారంగానే రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడమో, అధికారం కోల్పోవడమో జరుగుతోంది. పట్టణ ప్రాంతాలలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ఈ కారణంగా రాజకీయ పార్టీలన్నీ పేదల ఓట్లను కొల్లగొట్టడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఫలితంగా రోజుకో ఉచిత హామీ తెరపైకి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఎన్నికల సంస్కరణలు తక్షణ అవసరం. ఈ సంస్కరణల్లో భాగంగా ముందుగా ఎన్నికల ప్రచార వ్యయాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు ప్రచార మాధ్యమాలు విపరీతంగా విస్తరించాయి. కనుక ఎన్నికల ప్రచార వ్యవధిని వారం రోజులకు పరిమితం చేయగలిగితే ఖర్చును తగ్గించవచ్చు. రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలకు జవాబుదారీతనం తీసుకురావాలి. అన్నింటికంటే ముఖ్యంగా దామాషా ప్రాతిపదికన ఎన్నికలు జరిగే విధానం తీసుకురావాలి. అభ్యర్థుల బదులు రాజకీయ పార్టీలు మాత్రమే ఎన్నికలలో పోటీచేసే విధానం ఉంటే అభ్యర్థుల బ్లాక్‌మెయిలింగ్ నుంచి రాజకీయ పార్టీలకు కూడా రక్షణ ఏర్పడుతుంది. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలిచిన తర్వాత ఏ పార్టీతో అంటకాగుతారో తెలియని పరిస్థితి. తమ వద్ద డబ్బు ఉంది కనుకే ఆయా పార్టీలు తమకు పిలిచి మరీ టికెట్ ఇస్తున్నాయన్న అభిప్రాయంతో అభ్యర్థులు ఉంటున్నారు. దీంతో ఎన్నికలలో గెలిచిన పార్టీలు తమ సభ్యులను కాపాడుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించవలసిన దుస్థితి. అదే దామాషా ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తే ఏ పార్టీకి ఎంత శాతం ఓట్లు వస్తే అందుకు అనుగుణంగా ఆయా చట్టసభలలో తమకు నచ్చిన వారిని సభ్యులుగా నామినేట్ చేసే వెసులుబాటు వస్తుంది. దీనివల్ల అయారాం గయారాం సంస్కృతికి తెర పడుతుంది. విధేయతలకు పెద్దపీట లభిస్తుంది. దేశంలో ఏ ఒక్క పార్టీనో అధికారంలోకి వచ్చే రోజులు పోయాయి కనుక ఈ దామాషా విధానం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఏమీలేదు. మనదేశంలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నది ప్రస్తుతానికి ఒక్క న్యాయవ్యవస్థే కనుక ఈ ఎన్నికల సంస్కరణలకు కూడా సుప్రీంకోర్టు చొరవ తీసుకుంటే దేశానికి మేలు చేసినట్టు అవుతుంది. తమను తాము సంస్కరించుకోవడానికి రాజకీయ పార్టీలు ఎలాగూ ముందుకు రావు. అలాంటప్పుడు ఎవరో ఒకరు చొరవ తీసుకోక తప్పదు. మామూలుగా అయితే ఇలాంటి సందర్భాలలో ప్రజల నుంచి ఒత్తిడి రావాలి. కానీ వివిధ కారణాల వల్ల మన దేశంలో ఇప్పుడు ప్రజలను జడత్వం ఆవరించింది. ఏమి జరిగినా స్పందించే పరిస్థితి లేదు. నేను బాగుంటే చాలు అన్న ఆలోచనకు వచ్చాం కనుక ప్రజలలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న వారిలో కూడా నిరాశానిస్పృహలు పేరుకుపోతున్నాయి. న్యాయవ్యవస్థ పరిధి దాటుతున్నదని విమర్శించే వారు కూడా ఉన్నప్పటికీ సమాజ హితవు కోసం పరిధి దాటినా ప్రజల మద్దతు ఉంటుంది. ఉచిత హామీలకు ముకుతాడు వేయడంతోపాటు ఎన్నికల సంస్కరణలకు కూడా న్యాయవ్యవస్థ చొరవ తీసుకుంటుందని, సంబంధిత వ్యవస్థలపై ఒత్తిడి తెస్తుందని ఆశిద్దాం! ■

# పార్టీల అనుచిత ఉచితాలకు అడ్డుకట్ట సాధ్యమే!

- డి.వి.వి.యస్.వర్మ

జూలై 5, 2013న సుప్రీంకోర్టు మరో చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలతో ఇచ్చే అనుచిత ఉచితాలపై తీర్పు చెబుతూ కొన్ని నిర్దిష్టమైన సూచనలు చేసింది. దేశంలో చాలామంది మనసులో వున్న మాటను సుప్రీంకోర్టు బైటపెట్టింది. టెలివిజన్లు, సెల్‌ఫోన్లు, మిక్సీలు, లాప్‌టాప్‌లు, తాళిబొట్లు ఉచితంగా ఇస్తామని పార్టీలు చేసే అనుచిత హామీలు ఎన్నికల్లో ప్రజల్ని ప్రభావితం చేస్తాయని, సమన్యాయాన్ని దెబ్బతీస్తాయని, ఇవి స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు గొడ్డలి పెట్టులాంటిదని పేర్కొంది.

ప్రస్తుతం అమలులో ఉన్న ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చెయ్యడానికి ఇచ్చే డబ్బు, ఇతర ప్రలోభాలను మాత్రమే అవినీతికర చర్యలుగా పేర్కొంది. రాజకీయ పార్టీలు చేసే హామీలు, వాగ్దానాలు ఈ చట్టం పరిధిలోకి రావని అందువల్ల అనుచిత ఉచితాలను కట్టడి చేయడానికి వీలులేదని పేర్కొంది. వీటిని నిరోధించడానికి పార్లమెంటు తగిన చట్టం తీసుకురావాలని సూచించింది.

స్వేచ్ఛగా, సమన్యాయంతో ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమీషన్ రాజకీయ పార్టీలకు ఒక ప్రవర్తనా నియమావళిని అమలు చేస్తున్నది. ఈ ప్రవర్తనా నియమావళిలో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికలను భాగం చెయ్యాలని సూచించింది. దేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సంప్రదించి పార్టీల ఎన్నికల ప్రణాళికలకు మార్గదర్శకాలను రూపొందించాలని ఎన్నికల కమీషన్‌ను కోరింది.

ఈ సమస్యపై సుప్రీంకోర్టు తానే చొరవ తీసుకోకుండా, తన పరిధికి మించి వ్యవహరించకుండా ఎంతో సంయమనాన్ని పాటించింది. అదే సమయంలో అనుచిత ఉచితాల సమస్యపై



ఉచిత సెల్‌ఫోన్‌లు పంపిణీ చేస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్

స్పందించి దానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా రాజకీయ పార్టీలకు, ఎన్నికల కమిషన్‌కు సూచించింది.

ఎన్నికల కమిషన్ దీని మీద కసరత్తు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. అటు చట్టం తేవడంలోనూ, ఇటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో పార్టీల ఎన్నికల ప్రణాళికలను భాగం చేస్తూ మార్గదర్శకాలను రూపొందించడంలోనూ రాజకీయ పార్టీలు స్పందించే తీరు మీదే ఈ తీర్పు పర్యవసానాలు ఆధారపడి వుంటాయి. పార్టీలు ఎలా స్పందించినా సుప్రీంకోర్టు తీర్పు దేశవ్యాపితంగా చర్చను లేవనెత్తడం ఖాయం.

ఇక మరో తరహావి సంక్షేమం ముసుగులో సాగిస్తున్న ప్రజాకర్షణ పథకాలు. ఇవి తప్పనిసరి జీవితావసరాల నుండి ఉత్పన్నం అయినవి కావు. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చడం తద్వారా వారిని ప్రలోభ పర్చడం, ఓట్లు దండుకోవడం లక్ష్యంగా రూపొందించినవి. ప్రభుత్వ సొమ్ముతో ఉచితంగా కలర్ టీవీలు, సెల్‌ఫోన్లు, మిక్సీలు, ఫ్యాన్లు, లాప్‌టాప్‌లు, తాళిబొట్లు వగైరాలు. వీటిని పార్టీలు వాగ్దానాలు చెయ్యడం ప్రజల సొమ్ముతో ఓట్లు కొనుగోలు చెయ్యడానికి చేసే కార్యకలాపాలు. వీటినే అనుచిత ఉచితాలుగా అందరూ అభివర్ణిస్తున్నారు.

## సంక్షేమం వేరు, జనాకర్షణ వేరు



పార్టీలు తాముచేసే వాగ్దానాలకు సంక్షేమం ముసుగు తగిలిస్తున్నాయి. వాస్తవానికి సంక్షేమం వేరు, జనాకర్షణ పథకాలు వేరు. మొదటిది ప్రజల తక్షణ అవసరాలకు తోడ్పాటు నందించడం. మౌలిక అవసరాలను తీర్చడం. జనాకర్షణ పథకాలు దీనికి పూర్తిగా భిన్నమైనవి. ఇవి ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చడానికి దాని ద్వారా వారిని ప్రలోభపెట్టి ఓట్లు గుంజడానికి ఉద్దేశించబడినవి. అందుకే వీటిని అనుచిత ఉచితాలుగా గుర్తించడం జరిగింది.

అందరికీ మంచి ప్రమాణాల విద్యను అందించడం, ఆరోగ్య సేవలు అందించడం, యువతకు ఉపాధి నైపుణ్యాలు అందించడం నిస్సందేహంగా వారికి స్వతంత్ర జీవనాన్ని అందిస్తుంది. రైతులకు వ్యవసాయానికి రాయితీలు, పబ్లిక్ రవాణా కల్పించడం పరోక్షంగా సమాజానికి ప్రయోజనం కల్పిస్తాయి. అలాగే సమాజం మీద ఆధారపడిన వికలాంగులు, వితంతువులు, వయోవృద్ధులకు పెన్షన్‌లు సంక్షేమంలో తప్పనిసరి. పేదలకు ఆహారభద్రతకు తగిన ఏర్పాట్లు తప్పనిసరి. ఈ తరహా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వాలు విధిగా చేపట్టాలి. ఇవన్నీ సంక్షేమ కార్యక్రమాలకోవకు చెందిన అంశాలు. వీటిని ఎవరూ తప్పుపట్టరు-పట్టకూడదు. అయితే ఎవరికి ఇవ్వాలి, ఎలా ఇవ్వాలనేది ఆయా పార్టీలు, ప్రభుత్వాలు నిర్ణయించుకునే అవకాశం వుంటుంది.

## జనాకర్షణ పథకాల జననం

మన ఎన్నికల వ్యవస్థలో భాగంగానే జనాకర్షణ పథకాలు పుట్టుకొచ్చాయి. ఇది డబ్బు చుట్టూ తిరుగుతున్న ఎన్నికల వ్యవస్థ. ఎన్నికలలో కోట్ల కొలదీ పెట్టుబడి పెట్టడం, ఓట్లు కొనుగోలు చెయ్యడం, ఇతర ప్రలోభాలను అందించడం ద్వారా పార్టీలు తమ అభ్యర్థుల గెలుపును సాధిస్తున్నాయి. ఒకో నియోజకవర్గంలో ఒకో అభ్యర్థి 10, 15 కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత ఆ సొమ్ము రాబట్టుకోవడానికి ప్రభుత్వాలు తమ పాలనను అవినీతిమయం చేస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నాయి. సహజవనరుల దోపిడీకి అనుమతిస్తున్నాయి. ఈ అవినీతి భాగోతం ప్రజలందరికీ తెలుసు. ప్రజా వ్యతిరేకత నుండి తమను తాము కాపాడుకోవడానికి ప్రజల్ని ప్రలోభపెట్టే జనాకర్షణ పథకాలు పార్టీలకు అవసరం అయ్యాయి. ప్రభుత్వ సొమ్ములో కొంత భాగాన్ని ప్రజలకి నేరుగా

అందించే జనాకర్షణ పథకాలను ప్రారంభించాయి. మొత్తం మీద మన ఎన్నికల తంతు కోట్లు పెట్టుబడి పెట్టడం, తిరిగి అంతకు పదిరెట్లు దండుకోవడం. ప్రజలకు నేరుగా లబ్ధిచేకూరే జనాకర్షణ పథకాలతో ఓటు బ్యాంకులు సృష్టించుకోవడం అన్న వలయంలో పార్టీలన్నీ పడ్డాయి. ఈ ఎన్నికల వ్యవస్థ నుండే జనాకర్షణ పథకాలు పుట్టుకొచ్చాయి. ఈ జనాకర్షణ పథకాలకు నిజమైన పరిష్కారం, అవినీతికి నిజమైన పరిష్కారం ఎన్నికల సంస్కరణలో వుంది. ఈ ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చాలి. దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థ ఈ రుగ్మతల నిరోధానికి చాలా వరకు దోహదం చేస్తుంది. అలాంటి ఎన్నికల వ్యవస్థ ద్వారానే జనాకర్షణ పథకాల నుండి రాజకీయ పార్టీలు బైటపడగలుగుతాయి.

## నియంత్రించే మార్గాలు

సుప్రీంకోర్టు రెండు ప్రతిపాదనలు చేసింది. అయితే దీనికి నిర్దిష్టమైన చర్యలు అవసరం.

ముందుగా రాజకీయ పార్టీలు ఈ జనాకర్షణ పథకాలపై స్పష్టమైన ఏకాభిప్రాయానికి రావాలి. ఇంతవరకు మనకు తెలిసిన కలర్ టీవీలు, మిక్సీలు, సెల్‌ఫోన్లు, ఫ్యాన్లు, తాళిబొట్లు వగైరా అంశాలను గుర్తించడం, దానితోపాటు ఈ కోవకు చెందిన వివిధ వస్తు సముదాయాన్ని ఏ పార్టీ కూడా ఎన్నికల ప్రణాళికలో వాగ్దానాలలో, హామీలలో ఇవ్వకుండా చెయ్యాలి. వీటిని అందించడం అవినీతి చర్యగా ప్రకటించి ఇలాంటి వాటిని నిషేధించడం, ఉల్లంఘించిన పార్టీలపై కఠిన చర్యలను ప్రతిపాదించడం జరగాలి. వీటిని పార్టీల ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగం చేసి ఎన్నికల కమీషన్ అమలు చెయ్యాలి.

ఇక రెండోది సంక్షేమ పథకాలకు సంబంధించి, సూత్రప్రాయంగా సంక్షేమ పథకాలు ప్రకటించే వీలు పార్టీలకు వుండి తీరాలి. అయితే ఈ సంక్షేమ పథకాలను అందరికీ వర్తింపజేసే పేరుతో జనాకర్షణ పథకాలుగా పార్టీలు వీటిని మార్చే అవకాశం వుందన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు కల్పించడానికి బదులు నిరుద్యోగ భృతిని ప్రకటించడం, ఆహార భద్రత పేరుతో 65 శాతం ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరే ప్రణాళికల్ని ప్రకటించడం, ఉపాధి హామీ పేరుతో ప్రయోజనకరమైన పని లేకుండానే నగదు అందించడం వగైరాలన్నీ సంక్షేమం ముసుగులో సాగించే జనాకర్షణ పథకాలు అవుతాయి. ఇందులో అర్హులకి అన్నీ అందించాలి. అనర్హులకి ఎలాంటి అవకాశం లేకుండా చెయ్యాలి.

ఇక్కడ అనవసరపు సబ్సీడీలను నిరోధించడానికి నిర్దిష్టమైన చర్యలు అవసరం అవుతాయి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో సంక్షేమ పథకాలకు పెట్టే ఖర్చును నియంత్రించే చర్యలు తీసుకోవాలి. అర్హులందరికీ దక్కాలి, అనర్హులకీ, జనాకర్షణకీ తావు లేకుండా చెయ్యాలి. అంటే బడ్జెట్‌లలో ద్రవ్యలోటుకు పరిమితి పెట్టినట్లే, సంక్షేమ పథకాలకు, సబ్సీడీలకు పరిమితి వుండాలి. ఉదాహరణకి– బడ్జెట్‌లో 15 శాతం కంటే సంక్షేమ పథకాలకు మించకూడదనే షరతు తప్పనిసరిచేస్తే ఎవరు అధికారంలోకి వచ్చినా ఆ పరిమితిలోనే సర్దుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడ అవసరమో అక్కడ మాత్రమే అమలు చేసే స్థితి వస్తుంది. పార్టీలు తమ ప్రాధాన్యతలను బట్టి రాయితీలు ప్రకటించే వీలుంటుంది లేదా మరిన్ని వనరులు సమకూర్చుకుని సంక్షేమ కార్యక్రమాలను విస్తరించుకోవలసి వుంటుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధుల కేటాయింపులలో పరిమితికి లోబడి సబ్సీడీలు ఇస్తున్న రాష్ట్రాలకు అదనపు ప్రోత్సాహకాలను ఇచ్చే ఏర్పాట్లు వుండాలి.

ఒక పక్క జనాకర్షణ పథాకలను నిర్దిష్టపరచుకోవడం, మరోపక్క సంక్షేమ పథకాలలో జనాకర్షణ పద్ధతుల్ని వదిలించుకోవడం లక్ష్యంగా తగిన చర్యలు తీసుకోవడానికి పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధించాలి. పార్టీలు ఎన్నికల సంస్కరణలపట్ల, జనాకర్షణ పథకాల నిషేధంపట్ల, సంక్షేమ పథకాలకు బడ్జెట్లలో పరిమితుల ఏర్పాటు చేసే అంశాలపట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇవన్నీ సాధ్యమే. కాని ప్రస్తుతస్థితిలో పార్టీల నుండి అలాంటి చిత్తశుద్ధిని ఆశించలేం.

ఒక విషవలయంలో చిక్కుకున్న పార్టీలను దారికి తేవడానికి మిగిలింది ఒకే ఒక మార్గం. అది ప్రజాచైతన్యం. రాయితీల బతుకుతో సరిపెట్టుకోవడం కంటే ఎదిగే అవకాశాలు సాధించడం అవసరం అన్న స్పృహను ఎంతగా కలిగించగలిగితే పార్టీలు అంతగా దారికొస్తాయి. జనాకర్షణ పథకాలను వదిలించుకుని నిజమైన సంక్షేమ కార్యక్రమాలదారి పడతాయి. సుప్రీంకోర్టు తీర్పు అలాంటి చర్యకు, ప్రజా చైతన్యానికి నిస్సందేహంగా దారి తీస్తుంది. ■

# పార్టీల ఉచిత హామీలపై సుప్రీం ఆదేశాన్ని స్వాగతించిన లోక్‌సత్తా

తమను గెలిపిస్తే కలర్ టెలివిజన్లు, స్కూటర్లు వంటివి ఉచితంగా ఇస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీల్ని కట్టడి చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు జూలై 5న ఇచ్చిన తీర్పుని లోక్‌సత్తా పార్టీ మనస్ఫూర్తిగా ఆహ్వానించింది. ఆ దిశగా తగిన చట్టానికి చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం చెప్పటాన్ని కూడా స్వాగతిస్తున్నామని పేర్కొంది.

పేదరిక నిర్మూలన, వివక్షలేకుండా అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించటంతో సంబంధం లేకుండా కేవలం ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు దండుకునే లక్ష్యంతో ఉచితాల్ని, తాత్కాలిక పథకాల్ని ఇష్టమొచ్చినట్టు ప్రకటించటం ఈవేళ మన రాజకీయ వ్యవస్థకు శాపంగా మారిందని, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు అన్నారు. కాలే కడుపుకి బియ్యం ఉచితంగా ఇవ్వటం, గూడు లేనివారికి ఇళ్లు కట్టించి ఇవ్వటం, సంక్షోభంలో ఉన్న రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వటం చర్చనీయాంశమైనా అవి ఏదోకమేర పరిశీలించదగ్గవని, కానీ ఉచిత టీవీ, స్కూటర్, గ్రైండర్, నెక్లెస్ వంటి వాటి వెనక ఎటువంటి ప్రజాప్రయోజనం లేదని, ఎన్నికల్ని బహిరంగ వేలంపాటలుగా మార్చేస్తున్న అటువంటి హామీల్ని కఠినంగా నియంత్రించాలని అన్నారు.

“2006లో తమిళనాడులో డీఎంకే తన మేనిఫెస్టోలో ఉచిత టీవీల హామీనిచ్చినప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం మౌనంగా ఉండబట్టే, 2008 అసెంబ్లీ ఎన్నికలలో జాతీయపార్టీ అయిన కాంగ్రెస్ అదే హామీని కర్ణాటకలో ఇచ్చింది. ఈ రెంటినీ అనుకరిస్తూ 2009 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ మళ్లీ అదే హామీని ఇచ్చింది. ఇప్పటికైనా ప్రజాప్రయోజనానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా ఇస్తున్న అలాంటి హామీల్ని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోండి” అని 2008 మే 8న, 2009 మార్చి 12న కేంద్ర ఎన్నికల సంఘానికి సమగ్ర వివరాలతో రాసిన లేఖలలో లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారన్నారు. అవే చర్యలు చేపట్టాలని తాజాగా సుప్రీంకోర్టు కూడా సీఈసీని ఆదేశించటం హర్షణీయమన్నారు.



ఎటువంటి హేతుబద్ధతా లేని ఉచితాలు, రాయితీలు ఖచ్చితంగా ప్రజలకు ఇవ్వజూపుతున్న లంచాలేనని, మేనిఫెస్టో ముసుగులో వాటిని సాంప్రదాయ పార్టీలు విధానాల కింద చెలామణి చేస్తున్నాయని, వీటిని ఇలాగే వదిలేస్తే రాబోయే కాలంలో ఇంటింటికీ నెలకిన్ని లెక్కన మద్యం బాటిళ్లు కూడా సరఫరా చేస్తాయని శ్రీనివాసరావు అన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశంతోనైనా ఎన్నికల సంఘం స్పందించాలని, పార్టీల ఉచితాల ప్రలోభాల్ని అడ్డుకోవటానికి ప్రస్తుతం పార్లమెంటులో ఎలాంటి చట్టం లేదు కాబట్టి 324 రాజ్యాంగ ప్రకరణం ప్రకారం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కటారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ■

# దోషిగా తేలితే అనర్హులే...

## ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4)ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

- **1460 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు**
- **688 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై అత్యాచారం, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడీ వంటి తీవ్రమైన కేసులు**

పార్లమెంటు, అసెంబ్లీను నేరస్తుల నుంచి ప్రక్షాళన చేసేందుకు వీలుగా సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పుచెప్పింది. కింది కోర్టులో దోషులుగా నిర్ధారితులైన ప్రజాప్రతినిధులు... దానిపై ఉన్నతస్థాయి కోర్టులో చేసుకున్న అప్పీలు పెండింగ్‌లో ఉన్నట్లయితే వారిని అనర్హులను చేయరాదని చెప్తున్న ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4) న్యాయవిరుద్ధమైనదని పేర్కొంటూ అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రజాప్రతినిధులు దోషులుగా నిర్ధారితులైన తేదీ నుంచే వారు అనర్హులుగా మారతారని జస్టిస్ ఎ.కె.పట్నాయక్, జస్టిస్ ఎస్.జె.ముఖోపాధ్యాయలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే... ఈ తీర్పును ప్రకటించక ముందు దోషులుగా నిర్ధారితులై, అప్పీళ్లు దాఖలు చేసిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు తాజా నిర్ణయం వర్తించదని పేర్కొంది. సామాన్య పౌరుడికి, ప్రజాప్రాతినిధ్య చట్టం కింద రక్షణ పొందుతున్న ప్రజాప్రతినిధికి మధ్య వివక్షను తొలగించే లక్ష్యంతో ఈ తీర్పు ఇస్తున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### చట్టంలో వెసులుబాటు

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3) ప్రకారం... ఒక వ్యక్తిని ఏదైనా కోర్టు ఏ నేరంలోనైనా దోషిగా నిర్ధారించి, రెండేళ్లకు తక్కువ కాకుండా జైలు శిక్ష విధించినట్లయితే, సదరు వ్యక్తిపై అప్పటి నుంచీ, జైలు నుంచి విడుదలయ్యాక ఆరేళ్ల వరకూ అనర్హత వర్తిస్తుంది. అయితే ఆ తర్వాతి సబ్-సెక్షన్ 8(4) ప్రకారం.. ఒక ప్రజాప్రతినిధి దోషిగా నిర్ధారితమైనట్లయితే, మూడు నెలల వరకూ సదరు ప్రజాప్రతినిధిని అనర్హం చేయరాదు. ఆ మూడు నెలల సమయంలో వారు పైకోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నట్లయితే.. ఆ అప్పీలు పరిష్కారమయ్యే వరకూ సదరు ప్రజాప్రతినిధిని అనర్హం చేయరాదు. వివిధ నేరాల్లో దోషులుగా నిర్ధారితులైన ఎంపీలు, ఎమ్మెల్యేలకు పదవిలో ఉండటం వల్ల లభిస్తున్న ఈ ప్రయోజనాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరించాలని ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు కోరుతూనే ఉంది. అయితే అధికారంలో ఉన్నవారు తమ ప్రత్యర్థులను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచేందుకు రాజకీయ కక్ష సాధింపులతో తప్పుడు అభియోగాలు మోపుతుంటారని చెప్తూ రాజకీయ పార్టీలు ఈ సవరణను వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అయితే లిలీథామస్ అనే న్యాయవాది, లోక్‌ప్రహరి అనే ఎన్‌జీఓ దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు... సెక్షన్ 8(4)ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది.

### ఆచితూచి స్పందించిన రాజకీయ పక్షాలు

ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రక్షాళనకు దోహదం చేస్తుందంటూ మాజీ ప్రధాన ఎన్నికల కమీషనర్లు ముక్తకంఠంతో ఆహ్వానించగా... రాజకీయ పార్టీలు ఆచితూచి స్పందించాయి. వృత్తిరీత్యా న్యాయవాదులైన కేంద్ర న్యాయశాఖ మంత్రి కపిల్‌సిబల్, బీజేపీ అధికార ప్రతినిధి రవిశంకర్ ప్రసాద్ తీర్పును పరిశీలించిన తర్వాతే స్పందిస్తామని పేర్కొన్నారు. ఏ నిర్ణయమైనా రాజకీయ పార్టీలతో సహా అందరినీ సంప్రదించిన తర్వాతే తీసుకుంటామన్నారు. మరోవైపు ఎన్నికల సంస్కరణలు తెచ్చేందుకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతునిస్తోందని ఏఐసీసీ అధికార ప్రతినిధి అజయ్‌మాకెన్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును బీజేపీ ఆహ్వానిస్తోందని ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ముక్తార్ అబ్బాస్‌నక్వీ పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై రాజకీయ పార్టీలు ఎలా వ్యవహరిస్తాయనేది వేచిచూడాలని సీపీఐ నాయకుడు డి.రాజా వ్యాఖ్యానించారు.

### మూడోవంతు ప్రజాప్రతినిదులపై క్రిమినల్ కేసులు

నేషనల్ ఎలక్షన్ వాచ్, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థల అధ్యయనం మేరకు దేశంలోని ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 31 శాతం మందిపై పోలీసు రికార్డుల్లో క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం

4,807 మంది ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 1,460 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. వీరిలో 688 మంది అత్యాచారం, హత్య, హత్యాయత్నం, అపహరణ, దోపిడీ, బలవంతపు వసూళ్లు వంటి తీవ్రమైన కేసులు తమపై ఉన్నాయని ప్రకటించారు. మొత్తం ఆరుగురు ప్రజాప్రతినిధులు తమపై అత్యాచారం కేసులు ఉన్నాయని అఫిడవిట్లలో వెల్లడించారు. ఇక 543 మంది లోక్‌సభ సభ్యుల్లో 162 మందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వారిలో 75 మందిపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులున్నాయి. అలాగే.. మొత్తం 4,032 మంది సిటింగ్ ఎమ్మెల్యేల్లో 1,258 మంది ఎమ్మెల్యేలు వివిధ కోర్టుల్లో క్రిమినల్ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. వీటిలో 30% ఐదేళ్లకన్నా ఎక్కువకాలం శిక్షపడగల కేసులే. 2009నాటి జార్ఖండ్ అసెంబ్లీలో 74 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. వారిలో 55 మందిపై, 2010 బీహార్ అసెంబ్లీలో 55 శాతం మందిపై, 2012 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 47 శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అయితే 2012 మణిపూర్ అసెంబ్లీలో ఏ ఒక్క ఎమ్మెల్యేపైనా క్రిమినల్ కేసులు లేకపోవటం విశేషం.

కాంగ్రెస్ టికెట్లపై గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు 1,433 మందిలో 21 శాతం (305) మంది తమపై క్రిమినల్ కేసులున్నాయని ప్రకటించారు. బీజేపీ నుంచి 1,017 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు గెలవగా.. వారిలో 313 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. జేఎంఎం టికెట్లతో గెలిచిన వారిలో 82% మంది, ఆర్‌జేడీ టికెట్లతో గెలిచిన వారిలో 64% మంది, ఎస్పీ వారిలో 48 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తమ పరిశీలనలో తేలినట్లు ఎన్‌జీఓ వెల్లడించింది. ■

# మన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎందుకు పంపడం లేదు

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రజా వేదిక

**మీ అభిప్రాయాలు రాయండి... ప్రభుత్వం కళ్ళు తెరిపించండి**

**చర్చకు ఆహ్వానం**

- **ప్రభుత్వ పాఠశాలలో ఫీజులు వుండవు**
- **పుస్తకాలు దాదాపు అందరికీ ఉచితం**

అయినా మనం పిల్లల్ని అక్కడికి పంపడం లేదు
ప్రయివేటు విద్యాసంస్థలకు జేబుల్లోంచి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాం

## ఎందుకు ! ఎందుకు ! ఎందుకు!

**ఎందుకు మన పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపడం లేదు......**
**మీకు తెలిసిన కారణాలు, మీ అనుభవాలను సంగ్రహంగా ఒకటి రెండు 'ఎ4' సైజు పేజీలకు మించకుండా, జూలై 30లోగా మీకు అందేలా పంపండి.**

**ఆసక్తి గల విద్యావేత్తలు....తల్లిదండ్రులు ..... ఉపాధ్యాయులు .....**
**అందరినీ చర్చలో పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నాం.**

# నేరనేతలపై సుప్రీం తీర్పుకు ఆహ్వానం : జేపీ

ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ) లోని 8 (4) సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్వాగతించారు. కింది కోర్టులో దోషులుగా శిక్ష పడిన చట్టసభ సభ్యులు పైకోర్టులో అప్పీలు చేసుకుని, విచారణలో ఉందన్న పేరుతో అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఆ సెక్షన్ అవకాశం కల్పిస్తోంది.

సాధారణ పౌరులను, చట్టసభ సభ్యులను ఒకేలా పరిగణిస్తూ ఇచ్చిన తన చరిత్రాత్మక తీర్పు ద్వారా చట్ట సమానతకు సుప్రీంకోర్టు గట్టి ఊతమిచ్చిందని జేపీ అన్నారు. "రాజకీయాలలో నేరచరితులపై 1999 నుంచి దృష్టిసారించిన లోక్‌సత్తాకు ఇదో చిన్న, కానీ గణనీయ విజయం" అని పేర్కొన్నారు.

"స్వప్రయోజనాలను నెరవేర్చాలా, రాజ్యాంగ విరుద్ధంగా ఏర్పాటుచేసుకున్న ఆర్‌పీఏ చట్టనిబంధనకు సుప్రీంకోర్టు సాధికారికంగా పాతరేసినా, ఈ ఒక్క చర్యతో మనమేమీ అద్భుతాలను ఆశించలేం. వాస్తవ మార్పు రావాలంటే ఇంకా చాలా చేయాల్సుంది" అని జేపీ అన్నారు.

అసలైన సవాలు ఇప్పుడు రెండు రకాలుగా ఉందని జేపీ అన్నారు. కింది స్థాయి కోర్టులలో శిక్ష పడటానికి సుదీర్ఘ సమయం పడుతుంది కాబట్టి నేరచరిత్ర కలిగిన రాజకీయవేత్తలు చట్టసభ సభ్యులుగా కొనసాగుతూనే ఉంటారన్నారు. కిందిస్థాయి కోర్టులలో విచారణ వేగంగా పూర్తయి తీర్పులు వెలువడే సంస్థాగత ఏర్పాట్లు చేస్తేనే అటువంటి వైఫల్యాలను సరిచేయగలమన్నారు. ప్రత్యామ్నాయంగా, న్యాయస్థానంలో తీవ్రనేరాలకు సంబంధించి ఛార్జిషీట్ దాఖలైన వారు తమ కేసుల విచారణ పూర్తయ్యేంత వరకూ ఎన్నికలలో పోటీకి అనర్హులయ్యేలాగా ఏర్పాటు చేయాలన్నారు.

దర్యాప్తు ప్రక్రియ చాలావరకు రాజకీయవేత్తల గుప్పెట్లో ఉండటం వల్ల నేరపరిశోధనను, ప్రాసిక్యూషన్‌ను రాజకీయ జోక్యం నుంచి విముక్తి చేసి స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తేనే రాజకీయాలలో నేరచరిత్రులను నియంత్రించగలమని జయప్రకాష్ నారాయణ అన్నారు. ■

# 18 శాతం ఎమ్మెల్యేలపై కేసులు : ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

దేశ రాజకీయాలు నేరపూరితమవుతున్నాయని.. నేర చరిత్ర గల అభ్యర్థులకు ఓట్లు వేయవద్దని సుపరిపాలన వేదిక (ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్) పిలుపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో వివిధ కేసులు నమోదై ఉన్న శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీల వివరాలను వేదిక రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి మీడియాకు విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ అధ్యక్షుడు జస్టిస్ రెడ్డపరెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ రావు చెలికానిలతో కలిసి పద్మనాభరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని శాసనసభ్యుల్లో 18 శాతం మందిపై వివిధ రకాల కేసులు నమోదై ఉన్నాయని ఆరోపించారు. తమ సంస్థ రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల వివరాలను సమాచార హక్కు చట్టం కింద సేకరించిందన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలపై 6 సీబీఐ కేసులు నమోదై ఉన్నట్లు తమకు అనధికారికంగా సమాచారం ఉందన్నారు. శాసనసభ్యులు 295 మందిలో 83 మంది ఎమ్మెల్యేలపై కేసులు నమోదై ఉన్నాయని వివరించారు.

| కేసుల సంఖ్య | ఎమ్మెల్యేలు |
|---|---|
| 1-3 కేసులు | 60 మంది |
| 4-6 | 17 మంది |
| 7-10 | ముగ్గురు |
| 10 కంటే ఎక్కువ | ముగ్గురు |

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలవారీగా నమోదైన కేసులు, వాటి ప్రస్తుత పరిస్థితి, కేసు తీవ్రతకు సంబంధించి వేదిక వెల్లడించిన వివరాలను www.eenadu.net లో చూడవచ్చు.

రాజకీయ పార్టీలు క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులకు టికెట్లు ఇవ్వకూడదని, ప్రజలు కూడా వారికి ఓటు వేయకూడదని సుపరిపాలన వేదిక కార్యదర్శి పద్మనాభరెడ్డి అన్నారు. వివిధ కేసుల్లో శిక్షపడ్డ నాయకులు ప్రజా ప్రతినిధులుగా అనర్హులౌతారని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఒక్క రాజకీయ పార్టీ కూడా స్పందించలేదని జస్టిస్ రెడ్డప్పరెడ్డి తెలిపారు. ■

# ముండే ఉదంతాన్ని ఈసీ ఉపయోగించుకోవాలి: జేపీ లేఖ



లోక్‌సభ స్థానం ఎన్నికకు రూ. 8కోట్లు ఖర్చు పెట్టానని బహిరంగంగా నిజం చెప్పిన మహారాష్ట్ర ఎంపీ గోపీనాథ్ ముండేకి 'చట్టబద్ధ పరిధి కంటే ఎక్కువ ఖర్చుపెట్టావు కాబట్టి వివరణ ఇవ్వాలంటూ' కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నోటీసు జారీచేయటం ''హాస్యాస్పదం, అపరిపక్వం, గర్హనీయం'' అని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ అన్నారు.

ఈవేళ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికలలో నగర శివార్లలోని గ్రామాలలో సర్పంచ్ పదవికి కోట్లు ఖర్చుచేస్తున్నారని, దేశవ్యాప్తంగా జమ్మూకాశ్మీర్ సహా పలురాష్ట్రాలలో ఒక్కో ప్రధాన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం రూ. 5కోట్లు, లోక్‌సభ నియోజకవర్గానికి రూ. 15-30 కోట్లు ఖర్చు చేస్తోందని, ఇంతటి రాజకీయ, ఎన్నికల సంక్షోభాన్ని ఎదురుగా పెట్టుకుని నువ్వు నిజం చెబుతావా, నీ సంగతి చూస్తాం, చర్యలు తీసుకుంటామంటూ ఎన్నికల సంఘం మొక్కుబడిగా వ్యవహరించటం తగదని జేపీ అన్నారు. "ముండే లేదా మరే ఇతర వ్యక్తి కేసునైనా ఎన్నికల సంస్కరణలు, నిర్దిష్ట శాశ్వత పరిష్కారాలు సాధించే దిశగా లోతైన బహిరంగ చర్చ లేవనెత్తేందుకు సదవకాశాలుగా ఎన్నికల సంఘం వినియోగించుకోవాలి" అని జేపీ కోరారు.

**ఈ మేరకు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి వి.ఎస్ సంపత్‌కి తాను రాసిన లేఖను లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో విడుదల చేశారు.**

చట్టపరిధిలో నిర్దేశించిన దానికంటే అనూహ్యస్థాయి ఎక్కువగా ఎన్నికలలో ఖర్చుచేస్తున్న వైనాన్ని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి పార్లమెంటరీ కమిటీ ముందు, బైట కూడా పలుమార్లు చెప్పారని జేపీ తన లేఖలో గుర్తుచేశారు.

"మనలో దాదాపు ప్రతి చట్టసభ సభ్యుడూ తన కెరీర్‌ను ఎన్నికలలో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేయటం ద్వారా అబద్ధంతోనే ప్రారంభిస్తాడు" అని వాజ్‌పేయి చెప్పిన మాటల్ని జేపీ ఉటంకించారు. ఈ నిజాన్ని చెప్పినందుకు వాజ్‌పేయిని రాజకీయాలకు అనర్హుణ్ని చేస్తామా అని ప్రశ్నించారు. బీడ్ నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన గోపీనాథ్ ముండే కూడా ఆ బహిరంగ రహస్యాన్నే ఈవేళ బట్టబయలు చేశారన్నారు.

ఎన్నికల ఖర్చులో చాలామేరకు చట్టవిరుద్ధమైన, నల్లడబ్బు ఉంటుందని, ఓట్ల కొనుగోలు, మద్యం పంపిణీ, ఇతర ప్రలోభాలు ఇవ్వటానికి ఆ మొత్తాన్ని ఖర్చుచేస్తారని జేపీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) 2012లో చేసిన సర్వే ప్రకారం ప్రధాన పార్టీలు దాదాపు 60శాతం ఓటర్లకి డబ్బు పంపిణీ చేస్తున్నట్టు తేలిందన్నారు. ఈ లెక్కన ఓటర్లు ప్రధాన అభ్యర్థులందరి దగ్గరా డబ్బు తీసుకుని వారిలో తమకు నచ్చినవారికి ఓటు వేస్తున్నారన్నారు. దానికి తోడు 'చెల్లింపు వార్తలు' సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయన్నారు.

"డబ్బు ఖర్చు చేసినా గెలుపునకు గ్యారంటీ ఉండదు, కానీ డబ్బు వెదజల్లకపోతే మాత్రం ఓటమి ఖాయం. విజయానికి దగ్గరగా ఉండాలంటే, ఎన్నికలలో భారీ పెట్టుబడి ఒక ప్రవేశ రుసుంగా మారిపోయింది. సంపన్నుడి డబ్బు పేదవాని ఓటును వెంటాడుతోంది. ఎవరు గెలిచినా వనరుల్ని గుప్పెట్లో పెట్టుకుని, అధికారాన్ని అడ్డంపెట్టుకుని, తాను పెట్టిన పెట్టుబడికి అనేకరెట్లు

# హైకోర్టు ఆదేశాల మేరకు సహకార చట్టం తేవాలి

రాష్ట్రంలోని సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తికి గ్యారంటీ ఇచ్చేలా 97వ రాజ్యాంగ సవరణలోని పార్ట్ 9 (బి)ని కొట్టివేస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాన్ని జేపీ స్వాగతించారు. ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం తరపున తాము, ఇంకొందరు వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం, పిటిషన్ల ఫలితంగానే ఈ ఆదేశం వచ్చిందన్నారు.

యావత్‌దేశానికే నమూనాగా ఆంధ్రప్రదేశ్‌లో 1995లో వచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార) చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవటం దగ్గర్నుంచి, 97వ రాజ్యాంగ సవరణ (2012) ద్వారా 19 (1) (సి) ప్రకారం ట్రేడ్‌యూనియన్లు, వ్యక్తిగత సంస్థలలాగే సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కును కల్పించటం వరకు లోక్‌సత్తా విశేష కృషి చేసిందని, తాజాగా సహకార సంఘాల పనితీరును కూడా నిర్దేశించటం ద్వారా వాటి స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా 97వ రాజ్యాంగసవరణలో మూర్ఖంగా చేర్చిన పార్ట్ 9 (బి)ని తొలగించటంలో కూడా విజయం సాధించిందని జేపీ అన్నారు. 97వ రాజ్యాంగ సవరణలోని ఇతర భాగాలను సమర్థిస్తూనే పార్ట్ 9 (బి)ని గుజరాత్ హైకోర్టు కొట్టివేసింది.

వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలైన కడప, చిత్తూరులో ప్రభుత్వ డెయిరీలు మూత పడగా, మ్యాక్స్ చట్టం ద్వారా ఏర్పడిన డెయిరీలు లాభలో బాటలో పయనించి రైతులకు లాభాలు చేకూర్చాయని, ప్రజలు తమ ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసుకునే సహకార సంఘాలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిర్వీర్యం చేసేందుకు చేసే రాజకీయ కుట్రల మీద లోక్‌సత్తా పోరాడుతుంటుందని జేపీ స్పష్టంచేశారు. తాజాగా 97వ రాజ్యాంగ సవరణలోని పార్ట్ 9 (బి)ని కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు వల్ల సహకార సంస్థలకు స్వయంప్రతిపత్తికి స్పష్టమైన భరోసా ఏర్పడిందని, ప్రభుత్వం, రాజకీయ పార్టీలు తమ సొంత లాభం కోసం సహకార సంఘాలపై పెత్తనం మాని వాటి స్వయంప్రతిపత్తిని గౌరవించాలన్నారు. రాష్ట్ర సర్కారు ఆ దిశగా చట్టాల్ని మార్చాలన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ప్రభుత్వం ఇంకా వ్యవహరిస్తే, కోర్టు ద్వారానే చెప్పిస్తామని, ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకి వెళ్తే అక్కడ కూడా లోక్‌సత్తా పోరాడుతుందని, మ్యాక్స్ చట్టాన్ని పరిరక్షించటంలో విజయం సాధించినట్టే ఈ రాజ్యాంగ సవరణ విషయంలో కూడా గెలుస్తామన్న విశ్వాసం తమకుందని జేపీ అన్నారు. ■

---

దోచుకుంటున్నారు. ఇటువంటి ఎన్నికల వ్యవస్థలో అవినీతి విశృంఖలమవటం, పదవిని, అధికారాన్ని దుర్వినియోగం చేయటం తప్పనిసరిగా జరిగే పరిణామాలు" అని జేపీ పేర్కొన్నారు.

ఈ అంశాన్ని ఎన్నికల సంఘం సమగ్రంగా, లోతుగా, నిష్పాక్షికంగా పరిశీలించి ఎన్నికల సంస్కరణలపై, సంక్షోభ పరిష్కారానికి ఆచరణాత్మక కార్యాచరణపై లోతైన బహిరంగ చర్చను లేవనెత్తాలన్నారు.

"డబ్బు బలం అక్కర్లేకుండా, నియోజకవర్గంలో అదనపు ఓట్ల కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం లేకుండా నిబద్ధత, సమర్థత కలిగిన మహిళలు, పురుషులు ఎన్నికలలో నిలబడి ప్రజల స్థూల మద్దతుని పొంది ఎన్నికవగలిగేలా, హేతుబద్ధ, నైతిక రాజకీయాలు ఆచరణ సాధ్యమయ్యేలా సంస్కరణల్ని తీసుకురావాలి" అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని జేపీ కోరారు.

ఎన్నికల వ్యవస్థను మార్చే చట్టబద్ధ అధికారాలు ఎన్నికల సంఘానికి లేవని, అయితే ప్రభుత్వంలో, రాజకీయ పార్టీలలో, మీడియాలో, పౌరసమాజంలో, ప్రజలలో లోతైన, ఫలవంతమైన చర్చను లేవనెత్తే అవకాశం, అధికారం ఎన్నికల సంఘానికే ఉన్నాయని జేపీ అన్నారు. నటనను మాని ఈ దిశగా సంస్కరణల కోసం రాజకీయ పార్టీలు కూడా ముందుకు రావాలన్నారు. ■

# ఆహార భద్రతపై ఆర్డినెన్స్ గర్హనీయం: జేపీ

ఆర్డినెన్స్ ద్వారా ఆహారభద్రతా బిల్లును అమలుచేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా గర్హించారు.

ఏయేడాదికాయేడాది ప్రభుత్వానికి భారీ వ్యయంగా ఉంటుంది కాబట్టి ఆహారభద్రతా బిల్లు కూడా ద్రవ్య బిల్లుతో సమానమేనని, ఇలాంటి బిల్లును పార్లమెంటులో చర్చ లేకుండా ఒక ఆర్డినెన్స్ ద్వారా ఎలా అమలుచేస్తారని జేపీ ప్రశ్నించారు.

అత్యవసరమైనప్పుడు, చట్టసభ సమీప భవిష్యత్తులో సమావేశమయ్యే అవకాశం లేనప్పుడు మాత్రమే ప్రభుత్వం ఆర్డినెన్స్ మార్గాన్ని అనుసరించాలని జేపీ అన్నారు. ఎంతో కీలక, దీర్ఘకాల ప్రభావం చూపించే అంశాలు ఇమిడివున్నందున ఆహార భద్రతా బిల్లుపై తప్పనిసరిగా క్షుణ్ణమైన చర్చ జరగాల్సుందన్నారు. ఉదాహరణకు, రాష్ట్రాల మద్దతు లేకుండా ఈ బిల్లును అమలుచేయటం సాధ్యం కాదన్నారు.



తాత్కాలిక, అవకాశవాద రాజకీయ ప్రయోజనాల కోసం అప్రజాస్వామిక పద్ధతిలో వ్యవహరించటం ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయిందని జేపీ అన్నారు. ప్రతిపక్షాల మీద పైచేయి కోసం అడ్డదారుల్లో వ్యవహరించటం ప్రభుత్వ విశ్వసనీయతను, రాజ్యాంగబద్ధతను కూడా ప్రశ్నార్థకం చేస్తుందన్నారు.

ఆహార భద్రతా బిల్లులోని లోటుపాట్లు గురించి ఈ సందర్భంగా ప్రస్తావించని జేపీ – దేశ జనాభాలో మూడొంతుల ప్రజల ఆహార భద్రత గురించి ప్రభుత్వానికిగనక నిజంగా తపన ఉండుంటే, పౌష్టికాహార లోపాన్ని నిర్మూలించటానికి అన్ని రకాల ప్రత్యామ్నాయాలనూ లోతుగా పరిశీలించి ఆమోదయోగ్య విధానాన్ని రూపొందించి ఉండేదన్నారు.

**సీబీఐ స్వతంత్ర ప్రతిపత్తికి విస్తృత చర్యలు అవసరం**

జాతీయ స్థాయి దర్యాప్తు సంస్థ సీబీఐకి సంకెళ్లు తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సమర్పించిన అఫిడవిట్‌ని జేపీ స్వాగతించారు. అఫిడవిడ్‌లో పేర్కొన్న – సీబీఐ డైరెక్టర్‌ని, కొంతమంది సీనియర్ అధికారులను కొల్లీజియం ద్వారా నియమించటం, స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాసిక్యూటర్ల నియామకం, ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పించటం, స్వతంత్ర పర్యవేక్షణ ఏర్పాటు వంటి చర్యలు ఆహ్వానించదగ్గవేగానీ సరిపోవని జేపీ స్పష్టంచేశారు.

ఉన్నతాధికారులపై కేసు దర్యాప్తునకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న 'సింగిల్ డైరెక్టివ్'ను తొలగించాలని జేపీ అన్నారు. అలాగే ఎవరినైనా ప్రాసిక్యూట్ చేయటానికి ప్రభుత్వ ఆమోదం తీసుకోవాలని నిర్దేశిస్తున్న అవినీతి నిరోధక చట్టంలోని 19వ సెక్షన్‌ని కూడా తొలగించాలన్నారు.

తప్పనిసరి అనుకుంటే, అటువంటి దర్యాప్తులు, ప్రాసిక్యూషన్లకు అనుమతులిచ్చే అధికారాన్ని కొన్ని రక్షణకవచాలతో కేంద్ర విజిలెన్స్ కమిషనర్ పరిధిలో ఉంచవచ్చని జేపీ సూచించారు. కేసుల విచారణ వేగంగా పూర్తిచేసి, త్వరితంగా, ప్రభావశీలంగా న్యాయం చేకూర్చేలా ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేసేలా కూడా చట్టాన్ని సవరించాలన్నారు.

సీబీఐని పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి చర్యలూ తీసుకోవాలని జేపీ కోరారు. ప్రస్తుతం సీబీఐకి మొత్తం 6000మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, అందులో కేవలం 2500మంది మాత్రమే దర్యాప్తు విధుల్లో ఉంటారని జేపీ అన్నారు.

చట్టబద్ధ పాలనకున్న సంస్థాగత ఏర్పాట్లలో సీబీఐ కేవలం ఒక విభాగం మాత్రమేనని ప్రభుత్వం గుర్తించాలని జేపీ పేర్కొన్నారు. రాష్ట్రాలలోని ఏసీబీలు, సీబీసీఐడీ విభాగాలు ఏటా లక్షలాది కేసుల్ని చేపడతుంటాయన్నారు. కేసులలో మూడింట రెండొంతులు క్రిమినల్, ఒక వంతు మాత్రమే సివిల్ ఉన్న దేశం భారత్ మాత్రమేనన్నారు. మొత్తంమీద, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ ముద్రతోనే రాష్ట్రాలలో దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. కాబట్టి సీబీఐతోపాటు రాష్ట్రాలలోని ఏసీబీలు, సీబీసీఐడీ విభాగాలకు కూడా జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలన్నారు.

దర్యాప్తు సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనంతో వ్యవహరించేలా సంస్థాగత ఏర్పాట్లు చేసినప్పుడు మాత్రమే పటిష్ట చట్టబద్ధ పాలన సాధ్యమవుతుందని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ■

# అవినీతిలో మనం 'గ్రేట్'!

**రెండేళ్లుగా దేశంలో పెచ్చరిల్లిన అవినీతి**

- 68% మందికి ప్రభుత్వంపై నమ్మకం లేదు
- పార్టీలు అవినీతిమయమైనవని 86% మంది అభిప్రాయం
- సామాన్యుడి అత్యవసరాలేవీ అందడం లేదు
- 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ' అధ్యయనంలో వెల్లడి

అభివృద్ధిలోనే కాదు అవినీతిలోనూ భారతదేశం అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఇంతవరకు ఎన్నడూ లేనంతగా గత రెండేళ్లలో అవినీతి పెరిగిపోయింది. రాజకీయ పార్టీలు ఈ అవినీతికి కేంద్ర స్థానం అయితే.. పోలీసు, న్యాయవ్యవస్థలు ఆ స్థానం కోసం నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నాయి. ఇదేదో మాట వరసకు చెబుతున్నదీ కాదు. రాజకీయ నేతల ఆరోపణా కాదు.. ఇది దేశంలో 68 శాతం మంది ప్రజల అభిప్రాయం. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' సంస్థ అధ్యయనంలో తేలిన కఠోర వాస్తవం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో అవినీతి అంశంపై ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఏటా 'గ్లోబల్ కరప్షన్ బారోమీటర్' పేరిట సర్వే నిర్వహించి, నివేదికను విడుదల చేస్తుంది. ఈ ఏడాది కూడా 107 దేశాల్లో 1,14,270 మందని ప్రశ్నించి నివేదికను విడుదల చేసినట్లు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ ఆసియా, పసిఫిక్ రీజియన్ మేనేజర్ రుక్షానా నసయక్కర తెలిపారు. ఆ నివేదిక ప్రకారం దేశంలో గత రెండేళ్లుగా అవినీతి భారీగా పెరిగిపోయిందని సర్వేలో పాల్గొన్నవారిలో 68 శాతం మంది భారతీయులు అభిప్రాయపడ్డారు. అవినీతిని కట్టడి చేసే అంశంపై తమకు పూర్తిగా నమ్మకం లేదని స్పష్టం చేశారు. దేశంలో రాజకీయ పార్టీలు అవినీతిమయమైనవేనని ఏకంగా 86 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక గత ఏడాదికాలంలో ప్రభుత్వాధికారులకు కనీసం ఒక్కసారైనా లంచం ఇచ్చామని 54 శాతం మంది వెల్లడించారు. కాగా.. ప్రపంచవ్యాప్తంగా అవినీతిలో రాజకీయ పార్టీలు మొదటిస్థానంలో నిలవగా.. పోలీసు, న్యాయవ్యవస్థలు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

**ప్రజాస్వామ్యంపై విశ్వాసం పోతోంది..**

దేశంలో పెచ్చరిల్లుతున్న అవినీతి కారణంగా అత్యవసరమైన సరుకులు, సేవలు సామాన్యుడికి అందడం లేదని నివేదిక హెచ్చరించింది. ఇది మొత్తంగా చట్టం, ప్రజాస్వామ్య వ్యవస్థపైనే ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తోందని, అవినీతి కారణంగా కొన్నిసార్లు ప్రాథమిక హక్కులకు కూడా భంగం కలుగుతోందని వెల్లడించింది. దీనివల్ల వనరుల సమర్థ, సమాన పంపకంపై తీవ్రప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ అవినీతి చివరికి ప్రజలకు చట్టం పట్ల అసహ్యాన్ని కలిగిస్తోందని, సమాజ గౌరవానికి భంగం కలిగిస్తోందని తెలిపింది. ■

**నివేదిక ప్రకారం అవినీతి ఎందులో ఎంత?**

పోలీసు విభాగంలో 62 శాతం

రిజిస్ట్రేషన్లు, అనుమతులకు సంబంధించి 61 శాతం

విద్యలో 48 శాతం

భూమి సంబంధిత విభాగాల్లో 38 శాతం

న్యాయవ్యవస్థలో 36 శాతం

**దేశాలవారీగా అత్యంత అవినీతి విభాగాలు..**

51 దేశాల్లో రాజకీయ పార్టీలు

36 దేశాల్లో పోలీసు వ్యవస్థ

20 దేశాల్లో న్యాయవ్యవస్థ

**ఇదీ ప్రజాభిప్రాయం..**

**వివిధ రంగాల్లో అవినీతి ఉందని చెప్పినవారి శాతం**

రాజకీయ పార్టీల్లో ఉందన్నవారు - 86%

పోలీసుశాఖలో ఉందన్నవారు - 75%

ప్రభుత్వాధికారుల్లో ఉందన్నవారు - 65%

పార్లమెంటులో ఉందన్నవారు - 65%

న్యాయవ్యవస్థలో ఉందన్నవారు - 45%

మీడియాలో ఉందన్నవారు - 41%

# సామాజిక అభివృద్ధి ఎక్కడ?

రాష్ట్రంలో మూడోవంతు మండలాల్లో సామాజిక సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. అనేక మండలాలు అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నాయి. రాష్ట్రంలో సరాసరి అక్షరాస్యత 67 శాతం ఉండగా, నూరుకు పైగా మండలాల్లో ఈ శాతం యాభైకిలోపే. పౌష్టికాహార లోపం తీవ్రంగా ఉంది. అనేక మండలాల్లో ఐ.సి.డి.ఎస్. కార్యక్రమాలు బాగా వెనుకబడి ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాల పరిస్థితి దయనీయంగా ఉన్న మండలాలు, ఉప ప్రణాళిక అవసరం చాలా ఎక్కువగా ఉన్న మండలాలు 250కి పైగా ఉన్నాయి. సామాజిక సమస్యలపై ఇటీవల రాష్ట్ర ప్రణాళికా విభాగం... కేంద్ర ప్రణాళికాసంఘానికి నివేదిక సమర్పించింది. నివేదిక సారాంశం...

- సుమారు 350 మండలాల్లో సామాజిక సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఇందులో గిరిజనులు, దళితుల సంఖ్య ఎక్కువగా ఉన్న మండలాలే ఎక్కువగా ఉన్నాయి. ఖమ్మం, ఆదిలాబాద్, ప్రకాశం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వరంగల్, చిత్తూరు, కృష్ణా, మహబూబ్‌నగర్, నెల్లూరు తదితర జిల్లాల్లో పేదరికం, అక్షరాస్యత, పౌష్టికాహారలోపం ఇలా అన్నింటిని ఎదుర్కొంటున్న వారు ఎక్కువగా ఉన్న మండలాలున్నాయి.
- బాగా అభివృద్ధి చెందిన జిల్లాలుగా గుర్తింపు పొందిన ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల్లో సామాజిక రుగ్మతలను ఎదుర్కొంటున్న మండలాలు అధికంగా ఉండటాన్ని పరిశీలిస్తే, అభివృద్ధి ప్రతి జిల్లాలోనూ కొన్ని ప్రాంతాలకు, కొన్ని వర్గాలకే పరిమితమైందన్న విషయం తేటతెల్లమవుతోంది.
- రాష్ట్రంలో 2001 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యత శాతం 60.5. 2011 లెక్కల ప్రకారం 67 శాతానికి పెరిగింది. ఇదే జాతీయ సగటు 64.8 శాతం నుంచి 73 శాతానికి పెరిగింది. ఇప్పటికీ రాష్ట్రంలో 211 మండలాల్లో అక్షరాస్యత శాతం 55 లోపే. నూరు మండలాల్లో 50కి లోపే.
- అక్షరాస్యత తక్కువగా ఉన్న మండలాల సంఖ్య మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువకాగా, తర్వాత స్థానం విశాఖపట్టణం, ఆదిలాబాద్‌లది. కర్నూలు, మెదక్, విజయనగరం జిల్లాల్లో కూడా ఈ మండలాల సంఖ్య ఎక్కువగానే ఉంది.
- మహిళల్లో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉంది.
- షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల్లో 50 శాతానికంటే తక్కువ అక్షరాస్యత ఉన్న మండలాలు 211.
- ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులు అమలు జరుగుతున్నా పౌష్టికాహార లోపం ఇంకా ఉంది. 58 ప్రాజెక్టుల పరిధిలోని 160 మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది.
- మెదక్, కర్నూలు, నిజామాబాద్, విశాఖపట్టణం, చిత్తూరు, శ్రీకాకుళం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య ఉన్న మండలాలు ఎక్కువ. ■

# రాష్ట్రంలో వాస్తవానికి భిన్నంగా 'ఉపాధి' : జైరాం



ఆంధ్రప్రదేశ్ ఉపాధి హామీ పథకం అమలు విషయంలో అంచనాలు, సాధించిన ప్రగతిని పోలిస్తే వాస్తవానికి భిన్నంగా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ పేర్కొన్నారు. సీఎంకు రాసిన లేఖలో ఈ మేరకు స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధిలో కీలకమైన ఉపాధి హామీ పథకం అమలును సమీక్షించినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అమలు తీరు ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. లేబర్ బడ్జెట్ ఇంత ఉంటుందని పేర్కొన్నారని, కాని వాస్తవంగా ఆ స్థాయిలో వ్యయం చేయలేదని విమర్శించారు. 2012-13 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 841.06 లక్షల పనిదినాలు కల్పిస్తామని కేంద్రానికిచ్చిన నివేదికలో పేర్కొన్నారని, కానీ 466.66 లక్షల పనిదినాలే (55.5%) కల్పించారన్నారు. గతేడాదిలో 3,690 లక్షల పనిదినాలు కల్పిస్తామన్నా... 86 శాతమే పనిదినాలు కల్పించారన్నారు. ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు, కూలీల డిమాండ్ మేరకు ఆ పనుల కేటాయింపు, అమలు చేయాల్సిన పంచాయతీరాజ్ సంస్థలు, వీటన్నిటి పర్యవేక్షణ సరిగా లేదని తప్పుపట్టారు. ■

# 'అక్షరాలా' మనది అధమస్థానం!

- విద్యలో రాష్ట్రానికి 20వ ర్యాంకు
- ఆరోగ్యంలో బీహార్ కంటే వెనుకబాటు
- మౌలిక వసతుల కల్పనలో 14వ స్థానం
- 21 రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన ప్రణాళికా సంఘం
- మెరుగైన స్థానాల్లో... కేరళ, ఒడిశా, బీహార్‌లు

అక్షర క్రమంలో ముందున్నా... అక్షర జ్ఞానంలో మాత్రం మన రాష్ట్రం చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. దేశంలో విద్యాపరంగా జమ్మూకాశ్మీర్ చివరి స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఆరోగ్యంలో మనం 11వ స్థానంలో నిలిచి బీహార్ కంటే వెనుకబడిపోయాం. మౌలిక వసతుల కల్పనలోనూ రాష్ట్రం పరిస్థితి అంతంతే. మొత్తానికి అన్ని రంగాల్లోనూ దక్షిణాది రాష్ట్రాల కంటే మన పరిస్థితి అధ్వానంగానే ఉంది.

విద్య, వైద్యం, మౌలికవసతుల కల్పనలో జాతీయ సగటు, ఆయా రాష్ట్రాల్లో సాధించిన ఫలితాలను బట్టి ఇప్పటివరకు ర్యాంకులను నిర్ణయిస్తూ వచ్చిన ప్రణాళికా సంఘం... తాజాగా ఓ అధ్యయనం చేయించింది. ఉన్న వనరులను రాష్ట్రాలు ఏ మేరకు వినియోగించుకున్నాయి? తలసరి వినియోగం ఎంత? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తాజాగా ఏ రాష్ట్రం ఎక్కడుందో వెల్లడించింది.

ఇదివరకు జరిగిన అధ్యయనాలు నివేదికల ప్రకారం కేరళ అన్నిరంగాల్లో ముందుండగా... బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ బాగా వెనకబడి ఉండేవి. అయితే తాజా అధ్యయనం ప్రకారం పేద రాష్ట్రాలైన ఒడిశా, బీహార్, చత్తీస్‌గఢ్‌లలో పరిస్థితి బాగా మెరుగుపడింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార్ఖండ్‌ల పరిస్థితి దారుణంగా ఉంది. హిమాచల్‌ప్రదేశ్ పనితీరు ప్రశంసనీయంగా ఉండగా, గుజరాత్‌లో ఆరోగ్య రంగం అధ్వానంగా ఉంది. మౌలికవసతుల కల్పనలో మహారాష్ట్ర అధ్వానంగా ఉండగా, హర్యానా ఈ రెండింటిలోనూ వెనకబడి ఉంది. తాజా అధ్యయనం రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీకి దోహదపడుతుందని నివేదిక పేర్కొంది. అనేక అంశాల్లో రాష్ట్రాలను బేరీజు వేయడానికి అవకాశం ఉన్నా, ఆరోగ్యం, విద్య, మౌలికవసతులకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఈ రంగాలకు మాత్రమే పరిమితమైనట్లు నివేదిక పేర్కొంది.

**మూడు రంగాలపై విశ్లేషణ....**

ఈ మూడు రంగాల్లో 21 రాష్ట్రాలను విశ్లేషించింది. ఆరోగ్య రంగంలో... టీకాలు, మాతా శిశు మరణాలు, పారిశుద్ధ్యం, పౌష్టికాహార లోపం గల పిల్లలు, ఆసుపత్రుల్లో ప్రసవాలను పరిగణనలోకి తీసుకున్నారు. విద్యారంగానికి సంబంధించి... నమోదైన విద్యార్థులు, వారిలో చదవగలిగే స్థాయి, మహిళల అక్షరాస్యత, ఒకటి నుంచి 8వ తరగతి వరకు బడి మానేసే పిల్లల వివరాలను పరిశీలించారు. మౌలిక రంగాల్లో వ్యవసాయం, విద్యుత్తు, రవాణాను తీసుకున్నారు.

**ఆరోగ్యం, విద్య, మౌలిక వసతుల కల్పనలో రాష్ట్రాల వారీగా ర్యాంకుల వివరాలు...**

| రాష్ట్రం | ఆరోగ్యం | విద్య | మౌలిక వసతులు |
|---|---|---|---|
| కేరళ | 1 | 2 | 10 |
| తమిళనాడు | 2 | 10 | 6 |
| పశ్చిమబెంగాల్ | 3 | 5 | 13 |
| ఒడిశా | 4 | 3 | 3 |
| బీహార్ | 5 | 4 | 4 |
| కర్ణాటక | 6 | 17 | 12 |
| గోవా | 7 | 18 | 2 |
| పంజాబ్ | 8 | 11 | 7 |
| హిమాచల్‌ప్రదేశ్ | 9 | 1 | 1 |
| ఛత్తీస్‌గఢ్ | 10 | 7 | 9 |
| ఆంధ్రప్రదేశ్ | 11 | 20 | 14 |
| మహారాష్ట్ర | 12 | 6 | 21 |
| జార్ఖండ్ | 13 | 12 | 19 |
| జమ్మూకాశ్మీర్ | 14 | 21 | 17 |
| అస్సాం | 15 | 9 | 15 |
| గుజరాత్ | 16 | 14 | 11 |
| ఉత్తరప్రదేశ్ | 17 | 16 | 8 |
| రాజస్థాన్ | 18 | 19 | 16 |
| మధ్యప్రదేశ్ | 19 | 15 | 5 |
| హర్యానా | 20 | 8 | 20 |
| ఉత్తరాఖండ్ | 21 | 13 | 18 |

ఇప్పటివరకు ప్రణాళికా సంఘం... రాష్ట్రాల పనితీరును అంచనా వేసే విధానాన్ని పరిగణనలోకి తీసుకొని మూడు విభాగాలుగా (త్రీటైర్) విభజించింది. ఇందులో బాగా పనితీరు కనపర్చిన మొదటి విభాగంలో కేరళ, గోవా, హిమాచల్, పంజాబ్, తమిళనాడు, మహారాష్ట్ర, హర్యానాలున్నాయి. అయితే ఇప్పుడు మౌలిక వసతుల్లో మహారాష్ట్ర, ఆరోగ్యంలో హర్యానా పనితీరు సరిగాలేదు. రెండో విభాగంలో ఉన్న పశ్చిమబెంగాల్, ఉత్తరాఖండ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, ఒడిశాల పనితీరు మధ్యస్తంగా ఉంది. మూడో విభాగంలో రాజస్థాన్, అస్సాం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌లున్నాయి. వీటితో పాటు 2011 జనాభా లెక్కల ఆధారంగా... రాష్ట్రాల వారీగా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తలసరి వినియోగం, కొనుగోలు శక్తిని కూడా లెక్కలోకి తీసుకున్నారు.

తాజా అధ్యయనం ప్రకారం మూడు రంగాల్లో బాగా పనితీరు కనపర్చిన రాష్ట్రాలుగా హిమాచల్‌ప్రదేశ్, కేరళ, ఒడిశా, తమిళనాడు, బీహార్‌లను నివేదిక పేర్కొంది. పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లు కూడా మెరుగ్గా ఉన్నాయని వెల్లడించింది. హర్యానా, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలు మూడు అంశాలకుగాను రెండింటిలో వెనుకబడి ఉన్నాయి. ఒక రాష్ట్రం విద్య, ఆరోగ్యంలో వెనకబడితే ఇంకో రాష్ట్రం విద్య, మౌలిక రంగాల్లో వెనకబడి ఉందని నివేదిక విశ్లేషించింది. ■

# దస్తావేజులిచ్చిన 24 గంటల్లో రిజిస్ట్రేషన్

## చేయకపోతే రోజుకు రూ. 50 జరిమానా

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సిబ్బంది కరుణ కోసం గంటలు, రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం ఇక ప్రజలకు ఉండదు. ప్రజలు దరఖాస్తులు, దస్తావేజులు ఇచ్చిన తరవాత ఎంత గడువులోగా వాటిని పరిష్కరించాలో నిర్దేశిస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ ఉత్తర్వులిచ్చింది. పౌరసేవా పత్రం పేరుతో జారీచేసిన ఈ మార్గదర్శకాల ప్రకారం అక్కడ ప్రజలకు లభించే ప్రతి సేవకు గడువు పెట్టి, ఆలోగా చేయకపోతే అక్కడి సిబ్బందికి ఎంత జరిమానా విధిస్తారో తెలిపింది. గతంలో ఈ కార్యాలయాల్లో పౌరసేవా పత్రాలు ఉన్నా... వాటిని సక్రమంగా అమలు చేయడం లేదు. దాంతో జరిమానాలను కూడా పెట్టి, కొత్త మార్గదర్శకాలను రిజిస్ట్రేషన్ల శాఖ జారీచేసింది. నిర్దేశిత 24 గంటల్లో రిజిస్ట్రేషన్ పూర్తి కావాలంటే ప్రజలు అవసరమైన అన్నీ పత్రాలు సరిగా అందజేయాలని సూచించింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా తమకు గడువులు నిర్దేశించి జరిమానాలు విధించడం సరికాదని రాష్ట్ర రిజిస్ట్రార్ల సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్ విమర్శించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనితీరుపై ప్రజలు ఫిర్యాదు చేస్తే గంటలోగా స్పందించాలని, 24 గంటలలోగా ఆ సమస్యను పరిష్కరించాలని జిల్లా రిజిస్ట్రార్‌లకు గడువు పెట్టారు. ప్రజలు 18004259909 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. లేదా ప్రభుత్వ వెబ్‌సైట్ www.registration.ap.gov.in లో సైతం ప్రజలు తమ ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. సేవలకు విధించిన గడువు, జరిమానాల వివరాలు... ■

**రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లభించే సేవలకు గడువు**

| సేవ పేరు | ఎంత గడువు | ఎవరికి జరిమానా | రోజుకు జరిమానా రూ. |
|---|---|---|---|
| రిజిస్ట్రేషన్ | 24 గంటలు | సబ్ రిజిస్ట్రార్ | 50 |
| వివాహ రిజిస్ట్రేషన్ | గంట | సబ్ రిజిస్ట్రార్ | 10 |
| మార్కెట్ విలువ పత్రం | గంట | జూనియర్ లేదా సీనియర్ సహాయకులు | 10 గంటకు |
| ఈసీ | గంట | | 10 |
| ఈసీ పాత రికార్డులైతే | 24 గంటలు | ,, | 50 |
| చిట్‌ఫండ్ రిజిస్ట్రేషన్ | 3 రోజులు | ” సహాయ రిజిస్ట్రార్ | 50 |
| వీలునామా డిపాజిట్, తెరవడం | గంట | జిల్లా రిజిస్ట్రార్ | 10 గంటకు |
| సంఘాలు, చిత్రాల రిజిస్ట్రేషన్ | 3 రోజులు | ,, | 50 రోజుకు |
| స్టాంప్ వెండర్ లైసెన్స్ జారీ | 7 రోజులు | ,, | 50 రోజుకు |
| నోటరీ రికార్డు తనిఖీ | 30 రోజులు | ,, | 50 రోజుకు |

# ఖ 'నిజం'... జాతి సొత్తు కాదు

- భూమి యజమానికే అది సొంతం
- భూగర్భ నిక్షేపాలు, ఖనిజాలకు ప్రభుత్వం యజమాని కాదు
- హక్కు సర్కారుదని ఏ చట్టంలోనూ లేదు

ఖనిజ సంపద జాతి సొత్తు! భూమి ఎవరిదైనా.. దానిలో ఖనిజం మాత్రం దేశ సంపదే. ఇది ఇప్పటి వరకు ఉన్న అభిప్రాయం. కానీ, ఈ వాదన తప్పని చెప్పింది సుప్రీంకోర్టు! ఖనిజాలు భూమి యజమానికే చెందుతాయి... తప్పితే ప్రభుత్వానికి కాదని స్పష్టం చేసింది. భూగర్భ నిక్షేపాలు, ఖనిజ సంపదకు ప్రభుత్వమే యజమాని అంటూ దేశంలో ఇప్పటి వరకు ఎటువంటి చట్టం లేదని జస్టిస్ ఆర్ఎం లోధా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సంచలన ఆదేశాలు జారీ చేసింది. "భూగర్భ నిక్షేపాలు, ఖనిజ సంపదంతా జాతికే చెందుతుందని ప్రకటించే చట్టమేదీ లేదు. మరోవైపు, భూగర్భ నిక్షేపాలు, ఖనిజ సంపదపై యాజమాన్యం సర్వసాధారణంగానే భూమి యజమానికి దక్కుతుంది. నిర్దిష్ట కారణాలతో సదరు భూ యజమాని దానిని వదులుకుంటే తప్ప" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భూగర్భ ఖనిజాల వెలికితీత నియంత్రణకు సంబంధించిన వివిధ చట్టాలను ఉటంకిస్తూ... ఖనిజ సంపదపై యాజమాన్య హక్కు ప్రభుత్వానికే చెందుతుందని ఏ చట్టంలోనూ ఎక్కడా లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టం 1957లోని సెక్షన్ 425 ప్రకారం భూగర్భ నిక్షేపాలపై యాజమాన్య హక్కు తమదేనని భూ యజమానులు ప్రకటించుకోలేరన్న వాదనను తోసిపుచ్చింది. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ మైనింగ్ లీజు లేకుండా దేశంలో ఎక్కడా మైనింగ్ కార్యకలాపాలు జరపరాదని ఇదే చట్టం స్పష్టం చేస్తున్న సంగతి తెలిసిందే. సుప్రీం తాజా తీర్పుతో ఖనిజ తవ్వకాలను ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చెప్పినట్లయింది. "ఖనిజ సంపదపై యాజమాన్య హక్కులు ప్రభుత్వానివేనని ఆ చట్టంలో ఎక్కడా ఏ రూపంలోనూ చెప్పలేదు. అదే సమయంలో భూమి యజమానులకు అందులోని ఖనిజంపై యాజమాన్య హక్కులు లేవని చెప్పే నిబంధనలు కూడా అందులో లేవు. పన్నులు వసూలుకు తమకు హక్కుందని ప్రభుత్వం చెప్పే మాట సార్వభౌమాధికార అధికారంలోంచి వచ్చింది తప్పితే అది యాజమాన్య హక్కు కాదు. పన్నులు వేసే అధికారం సార్వభౌమాధికారంలో తప్పనిసరి. అది యాజమాన్య హక్కుకు సంబంధించినది కాదు. వివిధ స్వాభావిక హక్కుల సమాహారంగా ఏర్పడిన హక్కు సారమే యాజమాన్య హక్కు. ఏదో ఒక ఆస్తి నుంచి ఉత్పత్తి అయిన దాంట్లో ఓ వ్యక్తి కొంత భాగం ఉందనుకోండి. దానర్థం ఆ ఆస్తి అంతా ఆ వ్యక్తికే చెందినదని కాదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే, ప్రభుత్వానికి భూ యజమానులు చెల్లించాల్సిన రాయల్టీ జోలికి తాము వెళ్లేది లేదని, దానిని ఉన్నత ధర్మాసనం నిర్ణయించాల్సి ఉందని స్పష్టం చేసింది. కేరళకు చెందిన కొంతమంది భూ యజమానులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ■

**సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు**



# శాసన పరిధిలోకి కోర్టులు చొచ్చుకుపోరాదు : సుప్రీం కోర్టు

- ప్రభుత్వ విధానాలపై కోర్టులు నియంత్రణ పాటించాలి
- అవి రాజ్యాంగ విరుద్ధంగా ఉంటేనే జోక్యం చేసుకోవాలి

ప్రభుత్వాల అసంబద్ధ విధానాలకు పరిష్కారం ప్రజల చేతుల్లోనే ఉందని... వారు ఓట్లు వేసే సమయంలో ప్రభుత్వ విధానాలను తిరస్కరించగలరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ విధాన నిర్ణయాలపై న్యాయస్థానాలు న్యాయనిర్ణయం చేయటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. "ప్రభుత్వ విధాన నిర్ణయాలపై న్యాయనిర్ణయం చేసేటపుడు కోర్టులు న్యాయ నియంత్రణ పాటించాలి. కార్యనిర్వహణ లేదా శాసనవ్యవస్థ పరిధిలోకి చొచ్చుకుపోరాదు. ప్రభుత్వ విధానాలు రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా లేనప్పుడు మాత్రమే జోక్యం చేసుకోవాలి" అని స్పష్టం చేసింది. "ప్రభుత్వ విధానం అసంబద్ధంగా ఉందని ప్రజలు భావిస్తే.. దానికి పరిష్కారం ఎన్నికల సమయంలో దానిని తిరస్కరించటమే. విధానానికి సంబంధించి కోర్టుకు చాలా పరిమితమైన పరిధి మాత్రమే ఉంది" అని జస్టిస్ సి.కె.ప్రసాద్, జస్టిస్ వి.గోపాలగౌడలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. గుజరాత్‌లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్టు నుంచి కచ్ జిల్లాకు మరింత నీటిని విడుదల చేసేలా గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'కచ్ జలసంకట్ నివారణ్ సమితి' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. ఈ విషయంలో జోక్యం చేసుకోవటానికి నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పులో పై వ్యాఖ్యలు చేసింది. "రాజ్యంలోని విభిన్న అంగాల అధికారాల మధ్య విస్తృత విభజన్న ఉన్నదన్న వాస్తవంపై మాకు స్పృహ ఉంది. కాబట్టి.. ఈ కోర్టు న్యాయ నియంత్రణ పాటిస్తూ, కార్య నిర్వహణ లేదా శాసనవ్యవస్థ పరిధిలోకి చొచ్చుకుపోరాదని భావిస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానానికి సంబంధించి, అవసరమైన సాంకేతిక నైపుణ్యానికి సంబంధించిన అంశాలను.. దానికి సంబంధించిన బాధ్యత, అర్హత గల వారికే వదిలిపెట్టటం ఉత్తమమని తాము భావిస్తున్నట్లు తెలిపింది. ■

# కౌలు రైతుకు దక్కని పరపతి

రాష్ట్రంలో కౌలు రైతుకు ఈ ఏడాది కూడా బ్యాంకుల్లో పరపతి దక్కని దుస్థితి నెలకొంది. ఖరీఫ్ కాలం మొదలై నెలదాటినా బ్యాంకులు మంజూరు చేసిన రుణాలు రూ. 23.32 కోట్లు మాత్రమే. అలాగే రుణార్హత గుర్తింపు కార్డుల (ఎల్ఈసీ) జారీ కూడా నత్తనడక నడుస్తోంది. ఈ ఏడాది కౌలు రైతులకు కొత్త, రెన్యూవల్ కలిపి 14.55 లక్షల కార్డుల జారీకి రెవెన్యూశాఖ లక్ష్యం నిర్దేశించుకోగా ఇచ్చింది 3.23 లక్షలే అయితే, అందులో లక్ష మాత్రమే కొత్తవి కావడం గమనార్హం. మరోవైపు కౌలు రైతులకు ఇచ్చిన రుణాల రికవరీ బాగా తక్కువగా ఉందంటూ బ్యాంకులు వారికి రుణాలివ్వడంపై ఆసక్తి చూపడంలేదు. పోయినేడాది కూడా రూ. 2వేల కోట్ల మేర వారికి ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, రూ. 312 కోట్లతో సరిపెట్టాయి. అలాగే 12 లక్షల ఎల్ఈసీ కార్డుల లక్ష్యంలో జారీచేసింది 4.23 లక్షలే. ఈసారి కూడా ఇవే పరిస్థితులు పునరావృతం కావడంతో కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వలలో పడక తప్పని దురవస్థ దాపురించింది. వాస్తవానికి ఎల్ఈసీ కార్డులు ఇన్‌పుట్ సబ్సిడీ వంటి రాయితీలకూ ఉపయోగ పడతాయని, వీటి జారీలో జాప్యం వల్ల సిసలైన సాగుదారుకు నష్టం తప్పదని రైతు సంఘాలంటున్నాయి. ఇక ఖరీఫ్‌లో బ్యాంకుల మొత్తం రుణ లక్ష్యం రూ. 31,996 కోట్లు కాగా, ఇప్పటివరకూ రూ. 6,259 కోట్లు (20 శాతం) మాత్రమే మంజూరు చేశాయి. ఇందులోనూ అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని బ్యాంకులే ఎక్కువగా ఇచ్చాయి. ఆగస్టు చివరికల్లా ఖరీఫ్ పంటరుణాల ప్రక్రియ ముగుస్తుండటంతో ఈ నెలాఖరుకు 50 శాతం లక్ష్యం పూర్తవుతుందని, వచ్చే నెలలో మిగిలిన 50 శాతాన్ని కూడా అధిగమిస్తామని వ్యవసాయశాఖ వర్గాలు భరోసా ఇస్తున్నాయి. ■

# రాజధానిలో సురక్షితంకాని భవనాలపై తక్షణం చర్యలు చేపట్టాలి: లోక్‌సత్తా

## సిటీలైట్ ఘటనాస్థలాన్ని సందర్శించి, క్షతగాత్రులను పరామర్శించిన కటారి



సికింద్రాబాద్ రాణిగంజ్ ప్రాంతంలో సిటీలైట్ హోటల్ కుప్పకూలి పలువురు మృతిచెందిన ఘటనను తీవ్రంగా పరిగణించాలని, 400 ఏళ్ల హైదరాబాద్‌లో శిథిలావస్థకు చేరిన అన్ని భవనాలనూ గుర్తించి వాటిని కూల్చివేసేందుకు వెంటనే ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని, నగరపాలక సంస్థ అధికారులను సోమవారం డిమాండ్ చేశారు.

విషాదం జరిగిన ఘటనాస్థలాన్ని, ఆ తర్వాత గాంధీ ఆసుపత్రిలో వున్న క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం శ్రీనివాసరావు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ... నూతన భవనాలకు అనుమతుల జారీలో ప్రభుత్వం, రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవటాన్ని ఇకనైనా ఆపాలన్నారు. పోలీసు, అగ్నిమాపక విభాగాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా మాల్స్‌కి, వాణిజ్య సముదాయాలకి ప్రభుత్వం అనుమతినిచ్చిన సందర్భాలు, నగర పాలక సంస్థ అధికారుల విధుల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని వరస ప్రభుత్వాలు అక్రమ భవనాల క్రమబద్ధీకరణను ఆదాయమార్గంగా చూసి అడ్డగోలుగా ఆమోదించటం కూడా ప్రమాదాలకు ఎక్కువగా కారణమవుతోందన్నారు. ఆచరణాత్మక సమగ్ర విధానంతో ఇటువంటి ధోరణుల్ని రాజీలేకుండా కట్టడి చేసినప్పుడే రాజధానిలో భవన ప్రమాదాలను పూర్తిస్థాయిలో నిరోధించగలమన్నారు.

ఈ తరహా ఘటనలు జరిగినప్పుడు సాధ్యమైనంత తక్కువ ప్రాణనష్టం, అంగవైకల్యంతోనే బైటపడేందుకు వీలుగా అధునాతన పరికరాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ సమకూర్చుకోవాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు కోరారు.

సహాయ చర్యలలో ప్రజల భాగస్వామ్యం ఆహ్వానించదగ్గదే అయినా, సహాయ చర్యలకు ఆటంకం కలిగించేలా పెద్దసంఖ్యలో జనం ఘటనాస్థలం వద్ద గుమిగూడవద్దని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు దోసపాటి రాము, ఉపాధ్యక్షుడు గొర్తి శ్రీనివాస్ కూడా కటారి శ్రీనివాసరావుతోపాటు ఉన్నారు. ■

# విశాఖ గ్రంథాలయాన్ని కాపాడండి

రాజకీయ ప్రాబల్యంతో విశాఖపట్నం జిల్లా కేంద్ర గ్రంథాలయం (డీసీఎల్) పునర్నిర్మాణం లీజు కాంట్రాక్టును సొంతం చేసుకున్న ప్రత్యూష అసోసియేటెడ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ కాలపరిమితి పూర్తయినా ఇప్పటివరకూ ప్రాజెక్టుకు పునాది కూడా వేయలేదని, ఇప్పుడు ఆ నిబంధనలను కూడా మార్చి గ్రంథాలయం స్థలం నుంచి అక్రమ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.

**లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు వివరాలను బాబ్జీ మీడియాకు విడుదల చేశారు –**

గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నగరం నడిబొడ్డున తమకున్న సుమారు రూ.40 కోట్ల విలువైన 1 ఎకరం స్థలంలో అధునాతన గ్రంథాలయ నిర్మాణానికి కావలసిన నిధులు విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉన్నప్పటికీ, ఆ ప్రాంతంలో ఓ బలమైన రాజకీయ నాయకుడికి చెందిన ప్రత్యూష కంపెనీకి లీజు కాంట్రాక్టును కట్టబెట్టారని బాబ్జీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బీవోటీ పద్ధతిన వాణిజ్య సముదాయం, గ్రంథాలయ సదుపాయంతో కలిసిన నిర్మాణం మూడేళ్లలో పూర్తిచేయాలన్నది ఆ గుత్త ఒప్పందం. ఫిబ్రవరి 15, 2010న అమలులోకి వచ్చిన ఆ లీజు, అభివృద్ధి ఒప్పందం కాలపరిమితి ఇప్పటికే ముగిసింది. కానీ ఇప్పటివరకూ భవన నిర్మాణానికి పునాది పడకపోయినా కూడా, రాష్ట్ర గ్రంథాలయ అధికారులు ఒప్పందం రద్దుకి చర్యలు తీసుకోలేదు. అపరాధ రుసుం సైతం వసూలు చేయలేదు అని బాబ్జీ తెలిపారు.

ఈ వివరాలను లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా ఇంతవరకూ చర్యలు లేవు. తగినన్ని నిధులు ఉన్నందున జిల్లా కేంద్ర గ్రంథాయ సంస్థే బహుళ అంతస్తుల గ్రంథాలయ భవనాన్ని నిర్మించుకుంటే ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది కాబట్టి సర్కారు ఆదాయానికి గండి కొట్టేలా ప్రయివేటు వ్యక్తులతో లీజు ఒప్పందాలు తగదని, తక్షణం ప్రత్యూష సంస్థతో ఒప్పందాన్ని రద్దుచేసి గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోనే నిర్మాణం జరగాలని విశాఖపట్నం పౌరులు కోరుతున్నారని, ఈ దిశగా చర్యలకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులో భీశెట్టి బాబ్జీ కోరారు. ■

# కులం పేరుతో రాజకీయ ప్రదర్శనలు అర్థరహితం: జేపీ

కులం పేరుతో రాజకీయ ప్రదర్శనలను నిలుపుచేసేందుకు అలహాబాద్ హైకోర్టు చొరవ చూపటం ఆహ్వానించదగ్గ పరిణామమని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఉత్తర ప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలకు హైకోర్టు నోటీసులు జారీ చేయటం, అంతిమంగా కులం, ఇతర గ్రూపులను రాజకీయ కారణాలకోసం సమీకరించటంపై అన్ని పార్టీల మధ్య స్థూల ఏకాభిప్రాయానికి దారితీస్తుందని జేపీ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఒక్కోసారి పరస్పర విరుద్ధమైనవైనా సరే, అన్ని వర్గాల ప్రయోజనాలనీ సమన్వయం చేసి సమాజంలో సామరస్యతను పెంపొందించటమే రాజకీయ పార్టీల ప్రాథమిక కర్తవ్యమని జేపీ అన్నారు. కానీ అస్తిత్వ రాజకీయాల కోసం, ముఖ్యంగా కుల, మత, ప్రాంతీయ గ్రూపులని రెచ్చగొట్టే ధోరణి క్రమంగా చాలా పార్టీలలో పెరుగుతోందన్నారు. ఇది ఖచ్చితంగా సమాజంలో సామరస్యతకు, దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగిస్తుందన్నారు.

ఓట్ల కోసం కుల అస్తిత్వాన్ని రెచ్చగొట్టి, ప్రజల్ని విభజించటం 21వ శతాబ్దంలో అర్థరహితమని జేపీ అన్నారు.

జాతి సమగ్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా శాంతియుత సమావేశాలను, ప్రదర్శనలను నియంత్రించే స్పష్టమైన అధికారాన్ని శాసనవ్యవస్థకు, ప్రభుత్వానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిందని జేపీ అన్నారు. అదేవిధంగా ఆర్టికల్ 51 (ఎ) పౌరుల బాధ్యతలను తెలియచేస్తుందని, రాజ్యాంగాన్ని గౌరవించటం, స్వతంత్ర పోరాటకాలంనాటి ఉదాత్త లక్ష్యాలను అనుసరించటం, పెంపొందించటం, అన్ని వర్గాలు, గ్రూపుల మధ్య సామరస్యతను, సహోదర భావాన్ని పెంపొందించటం వంటి బాధ్యతల్ని నెరవేర్చాలని ఈ రాజ్యాంగ ప్రకరణం పౌరులకు నిర్దేశిస్తుందని అన్నారు.

ఈ నేపథ్యంలో, కులం పేరుతో రాజకీయ ప్రదర్శనల్ని నియంత్రించటం లేదా నిరోధించటం కోసం చేసే ఏ ప్రయత్నమైనా పూర్తిగా చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం అని జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. ■

# విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న జేపీ

కూకట్‌పల్లి



ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణ ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో పిల్లలు వెనుకబాటుకు కారణాన్ని తెలుసుకొని ఉపాధ్యాయులతోనూ సమీక్షించారు. ఆయన కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఆయన ముందుగా ఎంఈఓ వరకుమార్‌తో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో జరుగుతున్న సమగ్ర పాఠశాల భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. పాఠశాలను బాగా నిర్మిస్తున్నారని దీన్ని మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం ఆయన 4, 5, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను పలకరించారు. సైన్స్, గణితం, ఆంగ్లం ఇలా పలు పాఠ్యాంశాలపై వివిధ ప్రశ్నలు సంధించి జవాబులు తెలుసుకున్నారు. కొన్నింటికి విద్యార్థులు సమాధానాలు చెప్పగలిగినా కొన్నింటికి ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం ప్లేట్లు లేవని, తాగనీటి సౌకర్యం లేదని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేయాలని, ఇక ప్లేట్లు అందించేందుకు తాను ప్రయత్నిస్తానని చెప్పారు.

# నియోజకవర్గ ప్రజలతో జేపీ ముఖాముఖి

కూకట్‌పల్లి



కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ సర్దార్ పటేల్‌నగర్ పార్టీ కార్యాలయానికి వచ్చి ప్రజలతో ముఖా-ముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయినపల్లి డివిజన్, పూల్‌భాగ్ కాలనీ వాసులు రాజిరెడ్డి, విఠల్‌రెడ్డిగార్లు డ్రైనేజి సమస్య గురించి వివరించగా, జేపీగారు ఈఈ రమేష్‌తో మాట్లాడి రెండు రోజులలో సమస్య పరిష్కారిస్తామన్నారు. శక్తినగర్ కాలనీ వాసులు బోర్‌వెల్స్, పార్కులు అభివృద్ధి చేయించాలని కోరారు. ఫతేనగర్ కార్మికనగర్ వాసులు ఇళ్ళ రెగ్యులరైజేషన్ గురించి అడుగగా తహసిల్దార్ హన్మంతరెడ్డితో మాట్లాడి వారి దగ్గర నుంచి పూర్తి వివరాలు తీసుకోమన్నారు. కెపిహెచ్‌బి రెయిన్ ట్రీ పార్కు (మలేషియన్ టౌన్‌షిప్) ముందు గల ట్రాఫిక్ సిగ్నల్ పనిచేయ్యటం లేదని ఫిర్యాదు చేయగా ట్రాఫిక్ సిఐ హరిక్రిష్ణతో మాట్లాడి దానికి ఎస్టిమేషన్ తయారు చేయించమన్నారు. మోతీనగర్ డివిజన్ గాయత్రినగర్ వాసులు విఠల్‌రెడ్డి త్రాగునీటిలో మురుగు కలుస్తుందని తెలుపగా వాటర్‌బోర్డు జిఎమ్ సుదర్శన్‌గారితో మాట్లాడి త్వరగా సమస్యని పరిష్కరించమని ఆదేశించారు. కూకట్‌పల్లి డివిజన్ ప్రకాష్‌నగర్ వాసులు త్రాగునీరు మరియు డ్రైనేజి సమస్య ఉందని తెలుపగా ఎమ్.ఎల్.ఏ.ఫండ్స్‌తో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు కొమ్ము సత్తయ్య, ఎన్.శ్రీనివాసన్, బాదినేని ప్రసాద్, మహేష్, నరసింహా, వంశీప్రసాద్, రామరాజు, జీవనలత, పేరిచర్ల భవాని, రాజు, ప్రమోద్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డుపై పోరాడి సాధించిన ఎమ్మెల్యే



ధర్నా చేస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

**కూకట్‌పల్లి**

కెపిహెచ్‌బి కాలనీ మొదటి రోడ్డులోని చెత్త డంపింగ్‌యార్డు సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఎమ్మెల్యే జయప్రకాష్‌నారాయణ ధర్నాకు దిగడంతో ఆగమేఘాల మీద అధికారులు డంపింగ్‌యార్డు తరలింపునకు ఏర్పాట్లు చేశారు. జేపీ ధర్నాకు దిగగా తెదేపా, భాజపా, వైకాపా నాయకులు మద్ధతు పలికారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే పన్నులతో పనిచేసే అధికారులు వారి సమస్యలు తీర్చడం లేదన్నారు. దాటవేత ధోరణితో రేపు, మాపు అంటూ సమస్యను సాగదీస్తున్నారని చెప్పారు. వెంటనే డంపింగ్‌యార్డును వేరేచోటుకు తరలించాలని డిమాండు చేశారు. ఉపకమీషనరు గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ డంపింగ్‌యార్డు తరలింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని, ఉద్యోగ భద్రత విషయంలో కార్మికులు భయపడుతున్నారని వారం రోజుల్లో సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేపీ కార్మిక నాయకులను పిలిపించి మాట్లాడారు. వారి ఉద్యోగ భద్రతకు తాను హామీగా ఉంటానని భరోసా ఇచ్చారు. చెత్త డంపింగ్ లారీలను కైత్లాపూర్‌కు వెళ్లేందుకు లోక్‌సత్తా పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు లారీలను డంపింగ్‌యార్డులోనికి వెళ్లకుండా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఉదయం ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. కృష్ణారావు, దండమూడి సామ్రాజ్యం, నర్సింగ్‌రావు, జాస్తి శ్రీధర్, సత్యనారాయణ, సాయిబాబా, కుమార్‌స్వామి, వెంకటేశ్వరరెడ్డి, రఘరాం, వైకాపా నాయకులు జార్జి, రమేష్, తదితరులు లోక్‌సత్తా ధర్నాకు పూర్తి మద్ధతుగా నిలిచారు. లోక్‌సత్తా నాయకులు కటారి శ్రీనివాస్‌రావు, శ్రీనివాసన్, కొమ్ముసత్తయ్య, సాంబిరెడ్డి, బాదినేని ప్రసాద్, మహిళా నాయకురాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స.హ.చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**జంగారెడ్డిగూడెం**

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు జానకిరామరాజు కోరారు. లోక్‌సత్తా పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమావేశం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్‌లో నియోజకవర్గ అధ్యక్షులు మానికల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షులు గొట్టుముక్కల జానకిరామరాజు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందాల్సిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చించారు. పార్టీ నాయకులు ఆర్నేపల్లి అప్పారావు, జి.బాలకృష్ణాచారి, నాగేంద్ర, భీమేశ్వరరావు, నల్లమిల్లి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో సురాజ్య ఉద్యమం




మన దేశానికి స్వరాజ్యం వచ్చినా సురాజ్యం రాలేదని ఇప్పుడున్నది స్వాహా రాజ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని విజయపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సురాజ్య ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సురాజ్యం రావాలంటే ఓటును నోటుతో కొనే సంస్కృతి అంతం కావాలన్నారు. జవాబుదారీతనం లేకపోవడం వల్లే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. సుపరిపాలన కోసం సీనియర్ సిటిజన్‌లు, మహిళలు, యువకులు పెద్దఎత్తున సురాజ్య ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులు ఆశించిన లక్ష్యాలు సాధించే వరకు విశ్రమించకూడదని సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సురాజ్య ఉద్యమ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు డా॥ రావు చెలికాని పిలుపునిచ్చారు. ఈ సురాజ్య ఉద్యమం జాతి మొత్తానికి వర్తించేదని ఇది రెండో స్వాతంత్ర పోరాటమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి సురాజ్య ఉద్యమ కమిటీ నాయకులు పార్థసారధి సమన్వయకర్తగా వ్యవహరించగా, విజయపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులు పి. భాస్కరరావు, జె. కృష్ణారావు, గ్రేటర్ హైదరాబాద్ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు దోసపాటి రాములు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యల్.బి.నగర్ నియోజకవర్గ అధ్యక్షులు జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, సాయినగర్‌కాలనీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, సుబ్బారావు, రమేష్, విష్ణు, సుకుమార్, శ్రీనివాస్‌రావు, రమణారెడ్డి (యల్.బి.నగర్ నియోజకవర్గం), పద్మజ, శివారెడ్డి (మహేశ్వరం నియోజకవర్గం)లు, పలుకాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### వలంటీర్లకు గుర్తింపుకార్డులు

చర్చా వేదికకు విచ్చేసిన సురాజ్య ఉద్యమ వలంటీర్లకు డా॥ చెలికాని రావుగారు "సురాజ్య రత్న" గుర్తింపు కార్డులనిచ్చి సత్కరించడం జరిగింది.

# మద్యనియంత్రణ కోరుతూ కాకినాడలో ధర్నా



కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మెమోరాండం యివ్వడం గురించి-

రాష్ట్రంలో తేదీ: 01-07-2013 నుండి అమలులోకి వస్తున్న నూతన మద్యవిధానాన్ని నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా పార్టీ చేపట్టిన ధర్నాలలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు కాకినాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారికి మెమోరాండం ఇచ్చి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించాలని, కఠిన మద్యనియంత్రణ అమలు చేయాలని, బెల్టుషాపులను తొలగించాలని వాటిని తొలగించటానికి స్థానిక సంస్థలకు, మహిళలకు అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.వి.వి.యస్.రామకృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు, లోక్‌సత్తా పార్టీ మహిళాసంస్థ నాయకురాలు పి. జయలక్ష్మి, కాకినాడ కార్పొరేషన్ ప్రెసిడెంట్ కిషోర్, పట్టణశాఖ అధ్యక్షులు అడపా శంకర్, రాజమండ్రి అర్బన్ అధ్యక్షులు డా॥ వి.వి.రామారావు, రామచంద్రపురం నియోజకవర్గ అధ్యక్షులు దేవు సదానందమూర్తి, ప్రకాష్, బాలానందకుమార్, శివరామకృష్ణ, రాజమండ్రి రూరల్ ఉపాధ్యక్షులు పున్నమ రాజు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

# లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు షురూ



లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చింతకాయల వీధిలో ఆ పార్టీ నేతలు కె. బాలసుబ్రహ్మణ్యం, బెల్లంకొండ సురేష్ ప్రారంభించారు. యాక్టివ్ సభ్యత్వానికి 47 మంది, సాధారణ సభ్యులుగా 90 మంది చేరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన రాజకీయాల కోసం యువత ముందుకు వచ్చి లోక్‌సత్తా పార్టీలో సభ్యత్వం తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, మునిచంద్ర, మదనమోహన్, విక్రమ్, ప్రసాద్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతి**

# మద్యం నూతన పాలసీని రద్దు చేయాలి



ప్రజల ప్రాణాలను హరించే మద్యం నూతన పాలసీని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ. రామానాయుడు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా బైరాగిపట్టెడలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సీపీఐ, లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తూ మద్యం ప్రియుల నుంచి అపరాధ రుసుం గుంజుకోవడం నీచమైన చర్య అని లోక్‌సత్తా పార్టీ నాయకుడు సిద్దయ్యనాయుడు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నవనీతం సాంబశివరావు మాట్లాడుతూ మద్యం మత్తులో యువత పెడదారిపడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పూనుకోవడం ప్రభుత్వ తప్పిదమేనన్నారు. సీపీఐ చేపట్టే మద్యనియంత్రణ ఉద్యమానికి ఏఐవైఎఫ్ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, కార్యవర్గ సభ్యులు ఎన్.డి.రవి, పి.మురళి, రాధాకృష్ణ, శ్రీరాములు, రామచంద్రయ్య, వెంకటేష్, లక్ష్మి, రత్నమ్మ, లోక్‌సత్తా పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం, సురేష్, మదనమోహన్, మునిచంద్ర, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

# లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల ధర్నా



**కర్నూలు**

నూతన మద్యం విధానాన్ని నిరసిస్తూ లోక్‌సత్తాపార్టీ ఆధ్వర్యంలో సిపిఐ, సిపిఐఎంఎల్ పార్టీల నాయకులు జిల్లా మద్య నిషేధ అబ్కారీశాఖ డిప్యూటీ కమీషనర్ కార్యాలయం ఎదురు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు యస్.ఎ.మజీద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయవనరులుగా చేసుకోవటం దురదృష్టకరమన్నారు. నూతన మద్యం విధానం ప్రజలను మరింత దోచుకొనే విధంగా ఉందని మండిపడ్డారు. లోక్‌సత్తా పార్టీ రాయలసీమ ఉపాధ్యక్షులు కె.ఓంకార్, జిల్లా కార్యదర్శి కె. వసంత్‌కుమార్, కోశాధికారి యం.వి.సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ(ఎంఎల్) కార్యదర్శి గోకారి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. తదనంతరం నాయకులు, కార్యకర్తలు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ కమీషనర్ ప్రేమ్‌ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జగన్నాధం, రసూల్, మహేష్, లోక్‌సత్తా పార్టీ నాయకురాలు శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీమతి సత్యవాణి, ప్రేమలత, జిల్లా అధికార ప్రతినిధి యన్.జి.శంకర్, డా॥ పద్మన్న, డెవిడ్ డా॥ శేరిరెడ్డి, యన్.ఎ.హమీద్, జి.వెంగళరెడ్డి, పి.యన్.క్రిష్ణ, ఉమాకాంతయ్య, రవీంద్రగౌడ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# డబ్బుకు ఓటు అమ్ముకోవద్దు

**చిలకలూరిపేట**

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు భానుప్రసాద్ కోరారు. మండలంలోని తాతపూడిలో పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఆయన గ్రామంలో పర్యటించారు. ఓటర్లను కలసి చైతన్య పరిచారు. డబ్బుకు ఓటును అమ్ముకోవద్దని, నిజాయతీతో ప్రజలు, గ్రామాభివృద్ధికి పనిచేసే వారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు షేక్ ఖాదిర్, ఎస్.కె.ఖాదర్, వెంకట్రావు, షరీఫ్ పాల్గొన్నారు.

# మద్యం మహమ్మారిని తరిమికొడతాం : లోక్‌సత్తా

**అమీర్‌పేట్**

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పర్మిట్ రూమ్‌లను వెంటనే రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున లోక్‌సత్తా పార్టీ మహిళలు తిరగబడతారని జూబ్లీహిల్స్ కార్యదర్శి ఉషారాణి తీవ్రంగా విమర్శించారు. అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ లోక్‌సత్తా ఇన్‌చార్జి సాంబిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహిళాసత్తా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి కృషి

## బ్రాడీపేట

లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు అన్నారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు నిలబడాలని, అభ్యర్థులు లేకపోతే స్వభావాలున్న వ్యక్తికి మద్దతివ్వాలన్నారు. తొలుత లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ మహిళలతో పార్టీ జెండాను ఎగురవేయించి, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌరసేవా కేంద్రాన్ని జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి భానుప్రసాద్, నగర అధ్యక్షుడు పద్మరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటుతో చేటు

## పిడుగురాళ్ల

ఓటుకు నోటు తీసుకోని ఓటు వేయడం మంచి పద్ధతి కాదని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పిడుగురాళ్లలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. యువత రాజకీయాల్లోకి వచ్చి పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం నడుస్తున్న రాజకీయం అధికార కోసమేనన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిస్తే కోట్లు దండుకోవచ్చని, సంపద దోచుకోవచ్చని, కర్మాగారాల యజమానుల నుంచి డబ్బులు వసూలు చేయవచ్చనే భావనతో వస్తున్నారని విమర్శించారు. వారు ఎవరి ఓట్లతో అధికారంలోకి వస్తున్నారో యువత తెలుసుకోవాలని అన్నారు. దాన్ని మార్చడం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఎల్లకాలం బానిసలుగా పడి ఉంటారా? ఆత్మగౌరవంతో తలెత్తుకుంటారో నిర్ణయించుకోవాలని యువకులను సూచించారు. ప్రజల బతుకులు బాగుపరిచే రాజకీయాలు కావాలన్నారు. నెహ్రూ, అంబేద్కర్, గాంధీ, ప్రకాశంలాంటి నాయకులు నిజాయితీతో నిలబడి సొంత లాభాన్ని మానుకొని జాతి కోసం పనిచేశారని తెలిపారు. నేటి నాయకులు ఎక్కడ అధికారం ఉంటే అక్కడ ఉంటున్నారన్నారు. బ్రహ్మనాయుడు పుట్టిన పల్నాటి గడ్డలో యువత చేవ చచ్చిన వారిలా ఉంటున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించటం లేదని తెలిపారు. జూట్ కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇద్దరు రాష్ట్ర మంత్రులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో పాదయాత్ర చేస్తున్నప్పుడు దుర్భర పరిస్థితులు చూశామన్నారు. పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఐలాండ్ సెంటర్ నుంచి పాదయాత్ర చేసుకుంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ విజయశ్రీ వైద్యశాల దగ్గరకు వచ్చారు. పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ప్రారంభించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐ. రాంమూర్తి, డా॥ మందపాటి కోటిరెడ్డి, ఎ.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధికే కోర్ భేటీ

## గుంటూరు

**తెలంగాణ పోరు పార్టీల వైఫల్యమే : జేపీ**

రాజకీయంగా లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశమవుతోందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ విషయంలో ఒక స్పష్టమైన నిర్ణయం వెలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుపొందడానికే కాంగ్రెస్ పార్టీ తెలంగాణపై నిర్ణయం తీసుకునేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం నియంతలా నిర్ణయాలు తీసుకోకుండా అందరితో సంప్రదించి, అత్యధికులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం వెలువరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడినా ప్రజలు సంయమనం పాటించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలు రాష్ట్రంలో అన్ని చోట్లా ఉన్నాయన్న విషయం మరువకూడదన్నారు. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంలో విభజన చిచ్చుపెట్టిన ఘనత అన్ని రాజకీయ పార్టీలకూ దక్కుతుందన్నారు. నిజాయితీపరులు పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేయాలని, వారికి లోక్‌సత్తా పూర్తి మద్దతు ఇస్తుందని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.





సికింద్రాబాద్‌లో సిటీలైట్ హోటల్ ఘటనాస్థలిని సందర్శించిన రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు





సిటీలైట్ హోటల్ ఘటనాస్థలిలో బాధితుల్ని పరామర్శిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు



కృష్ణాజిల్లా అవనిగడ్డలో నామినేషన్ వేస్తున్న లోక్‌సత్తా కార్యకర్తలు



గుంటూరులో లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జేపీ



చిలకలూరిపేటలో ఓటింగ్‌పై అవగాహనలో....



ఉత్తరాఖండ్ ఘటనకు నివాళులర్పిస్తున్న లోక్‌సత్తా కార్యకర్తలు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15




కూకట్‌పల్లిలో డంపింగ్‌యార్డ్ తరలింపు కోరుతూ పోరాడి విజయం సాధించిన జేపీ

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad